
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 | సంచిక: 153 | హైదరాబాద్ | మంగళవారం | 13 -02 - 2024 | పేజీలు: 8 | రూ.4/-




## నేడు కాళేశ్వరం పర్యటనకు సీఎం, కాంగ్రెస్ ఎంఎల్ఎలు...



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** మంగళవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంఎల్ఎలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, సిఎం రేవంత్ రెడ్డి, తదితరలు కాళేశ్వరంలో పర్యటించనున్నారు. అసెంబ్లీ ప్రారంభం కాగానే రేపు ఉదయం 9.30కి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మూడు బస్సులలో మేడిగడ్డకు బయల్దేరనున్నారు. ప్రజా ప్రతినిధుల బృందం రేపు మధ్యాహ్నం 3గంటలకు కాళేశ్వరం చేరుకోనున్నారు. ప్రజాప్రతినిధులు రెండు గంటలపాటు కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించనున్నారు. రేపు సాయంత్రం 5 గంటలకు ప్రజాప్రతినిధుల బృందం తిరిగి హైదరాబాద్‌కు రానుంది.

# రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా?



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకోనున్నారా? అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. 2006 నుంచి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయబరేలి నియోజకవర్గాన్ని తన కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రాకు అప్పగించి తాను రాజ్యసభకు వెళ్లాలని సోనియా గాంధీ యోచిస్తున్నారని వర్గాలు వెల్లడించాయి. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయరాదని సోనియా గాంధీ భావిస్తున్నట్లు వారు తెలిపారు. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా గాంధీని నామినేట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. గాంధీ కుటుంబానికి కంచుకోటగా నిలిచిన రాయబరేలి నుంచి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక గాంధీ వాద్రా మొట్టమొదటిసారి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవల కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 77 సంవత్సరాల సోనియా గాంధీ రానున్న రాజ్యసభ ఎన్నికల్లో జైపూర్ నుంచి నామినేషన్ వేయనున్నట్లు వర్గాలు తెలిపాయి.కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఈ పరిణామాన్ని అధికార మార్పిడిగా పరిగణించాల్సి ఉంటుంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపు తుడిచిపెట్టుకునిపోవడం, గాంధీ కుటుంబానికి పుట్టినిల్లు లాంటి ఉత్తర్ ప్రదేశ్‌లోని అమేథీలో రాహుల్ గాంధీ సైతం ఓటమిపాలైన పరిస్థితులలో సైతం రాయబరేలి నుంచి సోనియా గాంధీ గెలుపొందడం విశేషం. ప్రియాంక గాంధీ ఎన్నికల రాజకీయాలపై కొన్ని దశాబ్దాలుగా ఊహాగానాలు సాగుతున్నాయి. తన తల్లి వరుసగా గెలుపొందుతున్న రాయబరేలి స్థానం ప్రియాంకకు సురక్షితమైన స్థానం కాగలదని భావిస్తున్నారు. 1950వ దశకం నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఈ నియోజకవర్గం ఉంది. మొట్టమొదటిసారి ప్రియాంక గాంధీ తాతగారు ఫిరోజ్ గాంధీ ఈ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2019 జనవరిలో లాంఛనంగా క్రియాశీల రాజకీయాలలోకి ప్రవేశించిన ప్రియాంక గాంధీ

వివరాలు 2లో

## పోలీస్ నియామకాలపై హైపవర్ కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పోలీస్ నియామకాలపై జూబ్లీహిల్స్ నివాసంలో హైపవర్ కమిటీతో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. పోలీస్ నియామకాల్లో జీవో నెం.46 రద్దు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ రజినీకాంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, టిఎస్ఎల్‌పిఆర్‌బి చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, మక్కన్ సింగ్ ఠాగూర్, ఎమ్మెల్సీ వెంకట్ తదితరులు హాజరయ్యారు. త్వరలో కొన్ని ఉద్యోగాలకు నియామక పత్రాలు జారీ చేయనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై అడ్వకేట్ జనరల్ సలహా, సూచనలను సిఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# అసెంబ్లీలో ఉత్తమ్ వర్సెస్ హరీష్ రావు




**తెలంగాణ వీణ/హైదరాబాద్**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫ్రస్టేషన్ తాను అర్థం చేసుకుంటానని, ఉత్తమ్ పుట్టు కాంగ్రెస్ వాది ఆయనకు సిఎం కాలేదని బాధ ఉండొచ్చని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కృష్ణా ప్రాజెక్టులు, కెఆర్ఎంబి సంబంధిత అంశాలపై ఉత్తమ్-హరీష్ రావు వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. దీనిపై ఉత్తమ్ రీకౌంటర్ ఇచ్చారు. సిఎం కుర్చీపై కెసిఆర్ మామతో హరీష్ రావుకు పంచాయితీ ఉండొచ్చని చురకలంటించారు. సిఎం కుర్చీపై తమకేమీ వివాదాలు లేవని ఉత్తమ్ తెలిపారు.నీటి వాటాల పంపకాలపై కేంద్రానికి 27 లేఖలు రాశామని హరీష్ రావు తెలిపారు. నీటి వాటాల్లో 50:50 కావాలని కేంద్రానికి లేఖ రాశామని, తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ నేతలు చూస్తున్నారని హరీష్ ధ్వజమెత్తారు. ఓడలు బండ్లు అవుతాయని, బండ్లు ఓడలు అవుతాయని, కాంగ్రెస్ పాలకులు అధికారులు, తమపైకి తప్పులు నెడుతున్నారని పేర్కొన్నారు. తీర్మానంలోని డిమాండ్లకు తాము మద్దతు తెలుపుతున్నామని, తీర్మానంలో పెట్టినవి తాము గతంలో పెట్టిన డిమాండ్లేనని స్పష్టం చేశారు. జనవరి 17న జరిగిన భేటీలో కేంద్రానికి ప్రాజెక్టులు అప్పగిస్తున్నారని తెలిపారని, ఆ భేటీలో నెలరోజుల్లో అప్పగిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తెలిపిందని దుయ్యబట్టారు. తెలంగాణ ఇంజినీర్లు డ్యామ్‌లపైకి వెళ్లాలంటే కెఆర్ఎంబి కావాలని, ప్రాజెక్టుల అప్పగింతపై జనవరి 18 నాటి అన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయని, అన్ని పత్రికల్లో వార్తలు వచ్చినా ప్రభుత్వం స్పందించలేదని, జనవరి 17 నాటి భేటీ మినిట్స్ మరునాడే బయటకు వచ్చాయని, మినిట్స్‌లో తప్పు ఉందని జనవరి 27న మంత్రి కేంద్రానికి లేఖ రాశారని, మరి మంత్రి పది రోజుల పాటు ఏం చేశారని, ఎందుకు స్పందించలేదని, ఫిబ్రవరి 1 నాటి రెండో మీటింగ్‌లోనూ ప్రాజెక్టులు అప్పగిస్తామన్నారు.


# బిసిలను అవమాన పర్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది...

- నెహ్రూ కాలం నుంచి ఏనాడు బిసి సమస్యలను ఆపార్టీ పట్టించుకోలేదు
- ముగ్గురు పెద్దలకు భారతరత్న ఇవ్వడంపై హస్తం నేతలు జీర్ణించులేకపోతున్నారు: ఎంపి లక్ష్మణ్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఓబిసి, బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేస్తుందని బిజెపి రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా మోడీ కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని ఎండగట్టారని, బిసిల ప్రయోజనాలను నెహ్రూ కుటుంబం అణచివేసిందని మండిపడ్డారు. మోడీ ప్రశ్నలకి రాహుల్ గాంధీ తో సహా ఎవరు సమాధానం చెప్పలేదని, కాంగ్రెస్ అంబేద్కర్‌ను అవమానించిన ఇప్పుడు ఎస్సీ ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాట పడుతుందన్నారు. మోడీని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు అవమానిస్తున్నారని, కర్పూరీ ఠాకూర్, చరణ్ సింగ్, పివి. నరసింహా రావుకు భారత రత్న ఇవ్వడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు.రామాలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఎందుకు బహిష్కరించిందో చెప్పలేదని, హిందువులను ఆ పార్టీ అవమానించిందన్నారు. హిందువులను, దేవి దేవతలను అవమానించడమే సెక్యులరిజం అని ఆ పార్టీ భావిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మజ్లిస్ నేత అసదుద్దీన్ అసలైన మతతత్వ వాది అని, హిందుత్వం కోసం పనిచేస్తున్న ఏ వర్గాలను మోడీ ప్రభుత్వం విస్మరించలేదన్నారు. బిఆర్ఎస్ కేశవ రావు కూడా అయోధ్య రామ మందిరంపై పార్లమెంట్‌లో చర్చిస్తే తప్పు పడుతున్నారన్నారు. వీళ్లకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అయోధ్య పర్యాటక, ఆధ్యాత్మిక రంగంగా వెలుగొందుతోందని, రాముడు, రామసేతు మిథ్య అని కాంగ్రెస్ విమర్శలు చేస్తోందన్నారు. హిందువులను, హిందూ దేవుళ్లను విమర్శించడమే కాంగ్రెస్ లౌకిక వాదమని ఆరోపించారు. రాముడు మీద కాంగ్రెస్ అక్కసు వెళ్లగక్కిందని, త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం హిందుత్వం కోసం పని చేస్తుందనీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ విమర్శిస్తున్నారన్నారు. బిజెపి పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక, బస్సు యాత్రలపై ఎన్నికల కమిటీ సమావేశాల్లో చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఎండ గట్టడమే లక్ష్యంగా యాత్రలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## 12 మంది ఐపీఎస్‌ల బదిలీ




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రాష్ట్రంలో 12మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.మల్టీజోన్-2 ఐజీగా రాచకొండ సీపీ సుదీర్‌బాబును బదిలీ చేసింది. ఆయన ఇటీవల రాచకొండ సీపీగా వెళ్లిన విషయం తెలిసిందే. అలాగే ఆయనకు మల్టీజోన్-1 పూర్తిస్థాయి అదనపు ఐజీగానూ బాధ్యతలు ఆయన ఇచ్చింది. రాచకొండ సీపీగా తరుణ్‌జోషికి బాధ్యతలు అప్పగించింది. రామగుండం సీపీగా శ్రీనివాసులు, జోగులాంబ జోన్ డీఐజీగా ఎల్ఎస్ చౌహాన్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా జోయల్ డేవిస్, సీఐడీ డీఐజీగా నారాయణ్ నాయక్, టీఎస్ఆర్టీసీ విజిలెన్స్ ఎస్పీగా కే అపూర్వ రావ్, సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా డీ ఉదయ్‌కుమార్, ఈస్ట్‌జోన్ డీసీపీగా ఆర్ గిరిధర్ నియామకమయ్యారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డెప్యూటీ డైరెక్టర్‌గా డీ మురళీధర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సాధన రశ్మి పెరుమాల్‌ను బదిలీ చేసింది. బీ నవీన్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది రాచకొండ సీపీ - తరుణ్ జోషి, సౌత్వెస్ట్ డీసీపీ - ఉదయ్ కుమార్,టిఎస్ ఆర్టిసి విజిలెన్స్ ఎస్పీ - అపూర్వరావు,జోగులాంబ గద్వాల డీఐజీ - చౌహాన్,సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ - జోయల్ డేవిస్,హైదరాబాద్ జోన్ ఐజీ సుధీర్ బాబు, సీఐడీ డీఐజీ - నారాయణ్ నాయక్,పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ - మురళీధర్,ఈస్ట్ జోన్ డీసీపీ - గిరిధర్

## హెచ్‌ఎండిఎ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు ఎసిబి కోర్టులో చుక్కెదురు

- బెయిల్ పిటిషన్ కొట్టివేత



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** హెచ్‌ఎండిఎ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు ఎసిబి కోర్టులో చుక్కెదురైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన శివబాలకృష్ణ బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి ఎసిబి కోర్టు కొట్టివేసింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆయనపై అభియోగాలు ఉన్నాయి. ఎసిబి దర్యాప్తులో శివబాలకృష్ణకు సంబంధించి ఇప్పటివరకు రూ.250 కోట్ల

వివరాలు 2లో

## రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా?

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి ఎన్నికల్లో వారణాసిలో ప్రధాని నరేంద్ర మోడీపై పోటీ చేస్తారని ఊహాగానాలు పెద్ద ఎత్తున సాగాయి.అయితే ఉత్తర్ ప్రదేశ్‌లో పార్టీకి పునరుజ్జీవం కల్పించేందుకు ప్రియాంకను ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా నియమించిన అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆమెను ఉత్తర్ ప్రదేశ్‌లోని తూర్పు భాగానికి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆ తర్వాత ఆమెను యావత్ ఉత్తర్ ప్రదేశ్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే ఆ చర్యలు కాంగ్రెస్‌ను చావు దెబ్బ తీశాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత 2022లో జరిగిన ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలో బిజెపి విజయ దుందుభి మోగించి మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ సమయంలో ప్రియాంక గాంధీతో సమానంగా ఉత్తర్ ప్రదేశ్ పశ్చిమ భాగానికి ఇన్‌చార్జ్‌గా ఉన్న జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడి కాషాయ కండువా కప్పుకోవడంతో కాంగ్రెస్ ఆ రాష్ట్రంలో దాదాపు కనుమరగయ్యే పరిస్థితి ఏర్పడింది. కాగా..జనాకర్షణ శక్తిగల నేతగా పేరు తెచ్చుకున్న ప్రియాంక గాంధీ అనేక సంవత్సరాలుగా రాయబరేలి ప్రజలకు తన తల్లి తరఫున ప్రతినిధిగా వ్యవహరిస్తూ వస్తున్నారు.మరి కొద్ది నెలల్లో జరగనున్న లోక్స్‌భ ఎన్నికల్లో రాయబరేలి నుంచి ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేసిన పక్షంలో దీని ప్రభావం యావత్ ఉత్తర్ ప్రదేశ్‌పైనే పడే అవకాశం ఉంది. ఇది కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవానికి దోహదపడగలదని పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

## హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు ఎసిబి కోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

విలువైన ఆస్తులను గుర్తించారు. శివబాలకృష్ణ అవినీతి కేసులో ఓ ఐఏఎస్‌ను విచారించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు విచారణకు సంబంధించి సదరు ఐఏఎస్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. శివబాలకృష్ణకు బెయిల్ మంజూరు చేయవద్దని ఎసిబి అధికారులు కౌంటర్ పిటిషన్ వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న నాంపల్లి ఎసిబి కోర్టు హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ బెయిల్ పిటిషన్ కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.ఎసిబి విచారణలో శివ బాలకృష్ణ అక్రమాస్తులు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఆయనకు తెలంగాణతో పాటు ఏపిలోనూ భారీగా ఆస్తులు ఉన్నట్లు ఎసిబి గుర్తించింది. దొరికిన డాక్యుమెంట్స్ ఆధారంగా శివబాలకృష్ణ అక్రమాస్తుల లెక్కలు చూసి అధికారులు విస్తుపోతున్నారు. శివబాలకృష్ణకు 214 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు ఎసిబి గుర్తించింది. దాంతోపాటు 29 ప్లాట్స్, విలాసవంతమైన విల్లాలు, బంగారం, ఖరీదైన వాచ్‌లు, ఖరీదైన మొబైల్స్ శివబాలకృష్ణ వద్ద ఉన్నట్లు ఎసిబి అధికారులు గుర్తించారు.ప్రస్తుత మార్కెట్ ప్రకారం చూస్తే ఈ అవినీతి అనకొండ ఆర్జించింది రూ. 250 కోట్లు ఉంటుందని ఎసిబి ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. మొత్తం లెక్కలు తేలితే వీటి విలువ రూ.1000 కోట్లు దాటవచ్చునని భావిస్తున్నారు. జనవరి 24న ఎసిబి అధికారులు శివబాలకృష్ణను అరెస్ట్ చేశారు. ఎసిబి కోర్టు అనుమతితో అధికారులు ఎనిమిది రోజులపాటు కస్టడీకి తీసుకుని హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్‌ను విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. శివరామకృష్ణ వెనుక ఎవరున్నారు? ఎవరి అండతో ఈ స్థాయిలో ఆదాయాన్ని కూడబెట్టారు? అని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

## గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి పట్ల మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా కాటారం మండలంలోని మహదేవ్ పూర్ అటవీ ప్రాంతంలో వేటగాళ్ళు వన్యప్రాణులను వేటాడం కోసం అమర్చిన కరెంటు తీగలు తగిలి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఎ. ప్రవీణ్ కుమార్ మృతి చెందడం పట్ల అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూంబింగ్ ఆపరేషన్ చేస్తుండగా ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాలని చీఫ్ వైల్డ్ వార్డెన్ ఎమ్.సి. పర్గెన్‌ను మంత్రి ఆదేశించారు. అడవి జంతువులను వేటాడేందుకు వేటగాళ్ళు విద్యుత్ తీగలు అమర్చేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల వివరాలను సేకరించి గ్రేహౌండ్స్‌తో పాటు స్థానిక పోలీసు అధికారులకు అందించాలని మంత్రి సూచించారు. తద్వారా వారు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వన్యప్రాణులను వేటాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అటవీ అధికారులను ఆదేశించారు.



# మేడారం పోదాం పా! స్పెషల్ బస్సులు రెడీ...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:**ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం. సమ్మక్క-సారలమ్మ చెంతకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులను తరలించేందుకు 6 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. జాతర ఈ నెల 21 నుంచి 24 వరకు జరుగుతుండగా.. నెల రోజులకు ముందు నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. రద్దీని దృష్టిలో పెట్టుకుని చాలామంది ముందుగానే మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సాగుతోంది. దీనికి ఆర్టీసీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తాడ్వాయిలో టికెట్ ఇష్యుయింగ్ కౌంటర్లు, కామారంలో బస్సుల పార్కింగ్ కోసం మూడు పాయింట్లు.. మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్.. బేస్ క్యాంప్.. 48 క్యూ రెయిలింగ్స్ ఏర్పాటు చేశారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అన్ని



ఏర్పాట్లు చేసింది. జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉందని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 14.50 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నట్టు సజ్జనర్ తెలిపారు.

### 16న మేడారంలో ఆర్టీసీ బేస్ క్యాంపు ప్రారంభం

ఈ నెల 16న మేడారంలో టీఎస్ఆర్టీసీ బేస్ క్యాంప్ ప్రారంభం కానుంది. మేడారం జాతరలో దాదాపు 14వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. వారికి వసతి, భోజనం విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మేడారం జాతరను టీఎస్ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు సజ్జనార్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ఈ జాతరకు బస్సుల ద్వారా 30లక్షల మంది రానున్నట్టు ఆర్టీసీ అంచనా వేస్తోందని, రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు.

### ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాకిడి ఎక్కువే..

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మేడారానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లో 51 ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లను ఆర్టీసీ గుర్తించింది. ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

# దేశ ప్రజలకు ఉద్యోగాలు లేవు

**- వారిపై ద్రవ్యోల్బణ ప్రభావం ఉంది**

**- ప్రజలు జాగృతం కావాలి**

**- వారిని తప్పుడోవ పట్టిస్తున్నారు**

**- ఛత్తీస్‌గఢ్ కోర్బాలో న్యాయ్ యాత్రలో రాహుల్**

**తెలంగాణ వీణ/కోర్బా:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సోమవారం బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ప్రజలకు ఉద్యోగాలు రావడం లేదని, వారిని ద్రవ్యోల్బణం బాధిస్తోందని ఆయన ఆరోపించారు. తన భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా ఛత్తీస్‌గఢ్ కోర్బా నగరంలో సీతామడి ప్రాంతంలో ఒక సభలో రాహుల్ ప్రసంగిస్తూ, ప్రజలు జాగృతం కావాలని పిలుపు ఇచ్చారు. వారి జేబులు దోచుకుంటున్నారని, వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. కుల గణన జరిపించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను రాహుల్ పునరుద్ఘాటించారు. ప్రజల మద్దతుతో ఆ పని జరుగుతుందని ఆయన తెలిపారు. వెనుకబడిన తరగతులు, దళితులు, ఆదివాసీలు దేశ జనాభాలో 74 శాతం మేర ఉన్నారని, కాని ఆ సమాజాలలో నుంచి ఒక్కరూ భారత్‌లోని 200 అగ్రశ్రేణి సంస్థల యజమాని కారని, యాజమాన్యంలో కూడా లేరని, ఆ సంస్థలకు 'దేశంలోని డబ్బు ఇస్తున్నారు' అని రాహుల్ చెప్పారు.బిజెపి'హిందు రాష్ట్ర'అని అంటుందని, కానీ జనాభాలో 74 శాతం మందికి, దేశంలోని పేదలకు ఏదీ దక్కడం లేదని ఆయన విమర్శించారు. రాహుల్ కేంద్రాన్ని మరింతగా లక్ష్యం చేసుకుంటూ వారు కంచం చప్పుడు చేస్తున్నారని, గంట కొడుతున్నారని, మొబైల్ ఫోన్‌లు చూపుతున్నారని, ఆకలితో చనిపోతున్నారని ఆరోపించారు. '(క్రితం నెల) రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఏ నిరుపేదనైనా, కూలీనైనా, నిరుద్యోగినైనా, చిన్న వాణిజ్యవేత్తలనైనా చూశారా చెప్పండి. నాకు అదానీజీ, అంబానీజీ, అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యా రాయ్, ఇతర బడా వాణి



జ్యవేత్తలు కనిపించారు. అదానీజీ, అంబానీజీ, వారి కుటుంబాలు బడా ప్రకటనలు ఇచ్చారు' అని రాహుల్ అన్నారు. ప్రజలకు ఉద్యోగాలు రావడం లేదని, వారు ద్రవ్యోల్బణం ప్రభావానికి గురవుతున్నారని,మరొక వైపు 'అదానీ, అంబానీ చైనీయుల వస్తువులు అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు' అని ఆయన ఆరోపించారు. దానిని ఆర్థికపరమైన అన్యాయంగా రాహుల్ అభివర్ణించారు.

# ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబును కలిసిన దుబాయ్ కేర్స్ సిఇవో...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును దుబాయ్ కేర్స్ సంస్థ సిఇవో, వైస్ చైర్మన్ తారిఖ్ అల్ గర్గ్ సోమవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భారత విద్యా రంగానికి సంబంధించి కీలక చర్చలు జరిపారు. ప్రపంచ విద్యా వ్యవస్థ పురోగమనానికి తాము చేపడుతున్న చర్యల గురించి తారిఖ్ గర్గ్ రాష్ట్ర మంత్రికి వివరించారు. ఆయా దేశాల్లో విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తోందని, వివిధ దేశాల ప్రభుత్వాలతో భాగస్వామ్య మై పనిచేస్తున్నామన్నారు.మొదటి దశలో భాగంగా భారత్ తో సహా 10 దేశాల్లో విద్యా రంగం వేగవంతంగా పురోగమించడం కోసం గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ యాక్సి లరేటర్ (జీఈఎస్ఈ)ను మొదలుపెట్టామని తారిఖ్ గర్గ్ వివరిం చారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి సాధికారత కల్పిం చడం తమ లక్ష్యంగా పేర్కొన్నారు. అదే విధంగా కాప్28 క్లైమెట్ ఎజెండాలో విద్యా ప్రాముఖ్యతను కేంద్ర స్థానంలో చేర్పించామని, క్లైమెట్ (వాతావరణం )విద్యా రంగాలను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలియ జేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్యా రంగం మార్పుల కోసం పనిచేస్తున్న దుబాయ్ కేర్స్ సంస్థ సీఈఓను కలుసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతల గురించి వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తే ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.



# పార్లమెంటు ఎన్నికల కోసం బిజెపి 35 కమిటీల నియామకం

**- రోడ్డు షోలు, ప్రజాహిత యాత్రలు, విజయసంకల్ప యాత్రకు ప్లాన్ - పార్లమెంటు ఎన్నికల కమిటీ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుపు లక్ష్యంగా రాష్ట్ర బిజెపి 35 కమిటీలను ఏర్పాటు చేసింది. సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశ నిర్వహించి ఈ కమిటీలను వేసింది. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలు గెలవడమే తమ లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటు శాతాన్ని మరింత పెంచుకునేందుకు రాష్ట్ర పక్కా ప్రణాళికలు రచిస్తోందని,అందులో భాగంగా సభలు, సమావేశాలు, రోడ్ షోలు, ప్రజాహిత యాత్రలు, విజయ సంకల్ప యాత్రలు ప్లాన్ చేసిన్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆపార్టీ రాష్ట్ర సహా ఇంఛార్జి అరవింద్ మీనన్ హాజరయ్యారు. ఆయనతో పాటు రాష్ట్ర నేతలు లక్ష్మణ్, డికె అరుణ, ఈటల రాజేందర్, మురళీధర్ రావు, జితేందర్ రెడ్డి, చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఇందులో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం, సభలు సమావేశాలు, మేనిఫెస్టో, ఛార్జిషీట్ అంశాలపై చర్చించారు.

### లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి నియమించిన కమిటీలు:

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బిజెపి 35 కమిటీలు వేసింది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



నియమితులయ్యారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ కమిటీకి కో- కన్వీనర్‌లుగా ఏవీఎన్ రెడ్డి, గరికపాటి, రామచందర్‌రావులను నియమించారు.మరోవైపు ఎన్నికల కార్యాలయం ప్రముఖ్‌గా రంగారెడ్డి, సమ ప్రముఖ్‌గా మాధవిలు నియమితులయ్యారు. ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ప్రముఖ్‌గా లక్ష్మణ్‌కు మరో బాధ్యతను అప్పగించిన అధిష్ఠానం, పార్టీ ఛార్జిషీట్ కమిటీ ప్రముఖ్‌గా సీనియర్ నాయకుడు మురళీధర్ రావుకు బాధ్యతలు అప్పగించారు. మీడియా కమిటీ ప్రముఖ్‌గా కృష్ణ సాగర్ రావు, మీడియా రిలేషన్స్ కమిటీ ప్రముఖ్‌గా ప్రకాష్ రెడ్డి, సోషల్ మీడియా కమిటీకి పోరెడ్డి కిషోర్ రెడ్డి, ఎన్నికల కమిషన్, లీగల్ ఇష్యూస్ కమిటీ ప్రముఖ్‌గా ఆంథోనీ రెడ్డిలను పార్టీ నియమించినట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు.

# బానోత్ భద్రు నాయక్ కుటుంబానికి దాతల సహకారంతో 50 కేజీల బియ్యం, రూ.20 వేల ఆర్థిక సహాయం



**తెలంగాణ వీణ/హనుమకొండ జిల్లా స్టాపర్:** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం,నాజితండా గ్రామానికి చెందిన బానోత్ భద్రు నాయక్ ఈనెల 07/02/2024 తేదీన బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో దాన సంస్కారానికి డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని అన్వర్ ద్వారా తెలుసుకున్న రాగంపేట గ్రామం, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లాకు చెందిన బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) ఆధ్వర్యంలో తన వాట్సప్ సోషల్ మీడియా ద్వారా బానోత్ భద్రు నాయక్ కుటుంబానికి మీ వంతుగా సహాయం చేయాలని కోరడంతో వరంగల్ పోలీస్ అధికారులు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులు, రక్తదాతలు దాతల సహకారంతో సేకరించిన 50 కేజీల బియ్యం, రూ.20,000 రూపాయలను బానోత్ భద్రు నాయక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి యువ నేతాజీ ఫౌండేషన్ టీం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల నగేష్, గుగులోతు బాలు నాయక్, షేక్ ఫరీద్ పాషా, షేక్ అన్వర్ పాషా, రాజ్ కుమార్, కొత్తకొండ అరుణ్ కుమార్, తూనం రాము, ఉప్పరపల్లి రాజ్ కుమార్, సృజన, శిరీష, శైలజ, శ్రీనివాస్, వేనం ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, విజయ్, రమేష్, రాజు, మహేష్, సత్యనారాయణ, చంద్రశేఖర్, వేణు, లక్ష్మణ్ రావు, నరేష్, రవీందర్, ప్రదీప్, రాకేష్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు), శ్రీకాంత్, హరీష్ , శ్రీధర్, రాజశేఖర్, అశోక్,

---

# కనుల పండువగా మార్కండేయ జయంతి వేడుకలు

**- మహా అన్నప్రసాద వితరణ - పురవీధుల్లో శోభాయాత్ర**



**తెలంగాణ వీణ/ఆత్మకూరు:** భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని ఆత్మకూరు మండల కేంద్రంలోని పద్మశాలి మార్కండేయ సేవాసమితి ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. సోమవారం పద్మశాలి సేవా భవనంలో వేద బ్రాహ్మణులచే మంత్రోచ్ఛరణల మధ్య భక్త మార్కండేయుని ఆహ్వానించి ఘనంగా పూజల నిర్వహించారు. భక్తులు మార్కండేయ పూజా విధానాన్ని కన్నుల పండుగలా ఆధ్యాంతం వీక్షించి తన్మయత్వం చేందారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ చందా,లింగయ్యహాజరైనారు . అనంతరం మార్కండేయకు మహా నైవేద్యంగా సమర్పించిన మహా అన్న ప్రసాదాన్ని వచ్చిన భక్తులందరూ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులను మండల అధ్యక్షులు కులసంఘాపెద్దలు సన్మానించారు. అనంతరం భక్త మార్కండేయ శోభయాత్ర ఘనంగా నిర్వహించారు .కార్యక్రమం లో సంఘుసభ్యులు, కులసంఘ పెద్దలు మహిళలు, యూత్ సభ్యులు కోలాటలతో డిజియో పాటలతో, నృతాలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాసికంటి రాజేంద్రప్రసాద్, సలహాదారుడు డాక్టర్ చంద్రమోహన్, మండల పద్మశాలి అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షులు మార్త రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి ప్రసాద్, పద్మశాలి సంఘం అధ్యక్షులు వడ్డేపల్లి వేణు గోపాల్ ,ప్రధాన కార్యదర్శి మార్త కేదారి , కోశాధికారి అల్వాల రవి, కుల సంఘం పెద్దలు చిందం నరేందర్, పాపని రవీందర్,వెంగళదాసు వెంకటనర్సు, వడ్డేపల్లి రవి, కొంపెల్లి రవీందర్,యూత్ సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

---

# కళాతోరణం లోగో మారిస్తే.. ఓరుగల్లు నుండి మరో ఉద్యమం

**- బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ - గత ప్రభుత్వ పథకాలను అమలు చేయండి**
**- 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి**
**బిఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్**



**తెలంగాణ వీణ/హనుమకొండ జిల్లా స్టాపర్:** తెలంగాణ సంప్రదాయాలకు, తెలంగాణ గౌరవానికి ప్రతీక అయిన కళా తోరణాన్ని, చార్మినార్ చిహ్నాన్ని యధాతదిగా ఉంచాలని, మార్చినట్లయితే.. ఓరుగల్లు నుండి ప్రజలతో కలిసి మరో ఉద్యమ పోరాటం చేస్తామని హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్, హనుమకొండ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ సుధీర్ కుమార్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాకతీయుల తోరణం,చార్మినార్ చిహ్నాన్ని ప్రభుత్వ అధికారిక లోగో నుండి తీసివేయడం ఈ ప్రభుత్వ మూర?త్వమే అని అన్నారు.కేబినెట్ సమావేశంలో దీని ప్రస్తావన వచ్చినప్పుడు కేబినెట్ వ్యతిరేకించాలని అన్నారు. పోరుగల్లు లాంటి ఓరుగల్లు నగరంలో మేధావులు,శిల్పులు,కళాకారులు అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, ముఖ్యమంత్రి తాను తీసుకున్నటువంటి నిర్ణయాలను ఖండిస్తున్నామని అన్నారు. కాకతీయ తోరణం ను రకరకాల పేర్లతో పిలుస్తారని అన్నారు. ఈ తోరణం లో హంసలు,మొసల్లు కనబడతాయని,కాకతీయ రాజులు పాలించినటువంటి చరిత్ర కలిగినటువంటి ఈ తోరణం గొప్ప చరిత్రకు మారుపేరుగా నిలుస్తుందని అన్నారు. ఇలా తీసేయడం అవివేకమని, పోరుగల్లు లాంటి ఓరుగల్లు నుంచి మరో పోరాటానికైనా సిద్ధమే అని అన్నారు.కాకతీయుల పాలనలో ప్రజలు ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారని,టెంపుల్ టౌన్ గాను పేరుపొందిందని,చెరువుల నిర్మాణము ద్వారా అధిక సాగు చేసేవారని, ఇలాంటి వారి చరిత్రను రాబోయే తరాలకు తెలియజేసే విధంగా గత రాష్ట్ర ప్రభుత్వము అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ప్లేగు వ్యాధి అంతమోందీన తర్వాత చార్మినార్ నిర్మించడం జరిగిందని,అన్ని కులాల, మతాలవారు ఆరోగ్యంగా ఉండాలని ఆలోచనతో దాని నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.దాన్ని కూడా తొలగిస్తామని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు.తెలంగాణ వాదులంతా కూడా ఆందోళన చెందుతున్నారని, క్యాబినెట్ లో ఈ విషయాన్ని ప్రస్తావించేటువంటి తరుణంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంత్రులుగా ఉన్నటువంటి సీతక్క, సురేఖ వరంగల్ కీర్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి తొలగిస్తానని అంటే వ్యతిరేకించకపోవడం బాధాకరమన్నారు. అనేకమంది శిల్పులు,గొప్ప చరిత్రకారులు రూపొందించినటు వంటి ఈ తోరణం తొలగించడం పట్ల రాబోయే రోజుల్లో తెలంగాణ వాదులలో ఓరుగల్లు బిడ్డలందరితో ఖచ్చితంగా సమావేశం ఏర్పాటు చేస్తామని,మరో ఉద్యమం లేవనెత్తుతామని అన్నారు.మాయ మాటలు చెప్పి, 420 హామీలు, ఆరు గ్యారెంటీలతో 100 రోజుల సమయం దగ్గరకు పడుతున్న కూడా అమలు చేయకుండా చేతగాని హామీలతో, అమలు కానీ హామీలతో నిస్సాయస్థితిలో ఉన్నటువంటి ముఖ్యమంత్రి ఇటువంటి పనులను చేస్తూ అభివృద్ధిని పక్కకు పెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, మీరిచ్చిన హామీలు నెరవేర్చని యెడల అసెంబ్లీలో,ప్రజాక్షేత్రంలో ఖచ్చితంగా ప్రశ్నిస్తామని, ఇకనైనా రెచ్చగొట్టే విధానం మార్చుకోవాలని ముఖ్యమంత్రి కి హితవు పలికారు. బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. నీళ్లు నిధులు నియామకాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పడిందని, గడచిన పదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసిఆర్ కు దక్కుతుందన్నారు.చలో నల్గొండ సభను విజయవంతం చేయాలని అన్నారు.తెచ్చుకున్న తెలంగాణలో కోటి ఎకరాలకు నీటిని అందజేస్తే ఇప్పుడు వచ్చినటువంటి ప్రభుత్వం కృష్ణ నీటి పరివాహ ప్రాంతాల్లో ఉన్నటువంటి వారికి తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. మార్పు కావాలి అని అంటూ ప్రజల్ని మోసం చేసి అధికారంలోకి వచ్చినటువంటి ప్రభుత్వం మెరుగైన పాలనను అందించలేక,సౌకర్యాలను బాగుపరచలేక, గత ప్రభుత్వం మీదనే నిందారోపణలు చేయడం తగదన్నారు.ఉద్యమ నేత కేసిఆర్ సంపద పెంచాలి పేదలకు పెంచాలి అనేటువంటి నినాదంతో తెలంగాణలో అగ్రగామిగా నడిపారని అన్నారు. ఇప్పటి ప్రభుత్వానికి కాళేశ్వరం పైన క్లారిటీ లేదని, విజిలెన్స్ కమిషన్ వేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని పూటకో మాట మాట్లాడుతూ గత ప్రభుత్వం పై అనేక ఆరోపణలు చేస్తూ కాలం వెలదీస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వంలో ఉన్నటువంటి పథకాలను అదేవిధంగా అమలు చేయాలని అన్నారు దళిత బంధు, బీసీ బందు, మైనారిటీ బందు, గొర్రెల పంపిణీ చేపల పంపిణీ వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని అన్నారు. ఆరు గ్యారెంటీ లను 100 రోజుల్లో గా పూర్తి చేయాలని,లేనిపక్షంలో ప్రభుత్వం పైన పోరాటం చేస్తామని అన్నారు.తెలంగాణ రాష్ట్రం కోసం ఆనాడు కేసీఆర్ నాయకత్వంలో ఏ విధంగా పోరాటం చేసామో, కృష్ణ నీటి పరిహాక హక్కుల పైన కూడా అదే విధంగా పోరాటం చేస్తామని అన్నారు. జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ అర్థం లేని పనులే తప్ప, ఒక్క పనిని కూడా ఈ ప్రభుత్వం సక్రమంగా చేయడం లేదని అన్నారు. ఓరుగల్లు రాజధానిగా ఉండి ఆంధ్రప్రదేశ్,తెలంగాణ, దక్షిణ తమిళనాడు ఇతర రాష్ట్రాల్లో కూడా ఓరుగల్లు రాజులు పరిపాలించే వారిని కాకతీయ కళాతోరణం ను గేట్ వే ఆఫ్ వరంగల్ గా పిలిచేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వెనకబడ్డ కులాలను వర్గాలను విచ్ఛిన్నం చేసే దిశగా,కించపరిచే విధంగా ఈ ప్రభుత్వము వ్యవహరిస్తుందని అన్నారు. కేబినెట్ లో ఉన్నటువంటి మంత్రులకు పౌరుషము రోషం ఉంటే వ్యతిరేకించాలని అన్నారు. జాతీయ జెండాలో అశోక చక్రం లేదా దాన్ని తొలగించారా అని ప్రశ్నించారు.కాకతీయ కళోత్సవాలను ఘనంగా జరుపుకున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, మాజీ కూడా చైర్మన్లు మర్రి యాదవ రెడ్డి,సుందర్ రాజు యాదవ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వరరావు, మైనారిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నయీముద్దీన్, నాయకులు లక్ష్మీనారాయణ, రవీందర్, కేశవరెడ్డి, కుద్దూస్, శ్రీధర్ , జెండా రాజేష్, సురేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల నర్సింగ్ హెూమ్‌లో అరుదైన కణతి తొలగింపు...



**తెలంగాణ వీణ/కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని కోరుట్ల నర్సింగ్ హెూమ్ హాస్పటల్లో సోమవారం డాక్టర్ స్వీతి అనుప్ రావు,డాక్టర్ అనూప్ రావు దంపతుల ఆధ్వర్యంలో అరుదైన శాస్త్ర చికిత్స నిర్వహించి పేషెంట్ కడుపులో నుంచి 15 కిలోల కణతిని తొలగించారు. ఈ సందర్భంగా ఇరువురు డాక్టర్లను పేషెంట్ బంధువులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి



**తెలంగాణ వీణ/కోరుట్ల:**పట్టణంలోశ్రీ శివభక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం మెట్ పల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు ధ్యవనపల్లి రాజారాం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు మార్కండేయ జయంతి ఉత్సవాలలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ నిత్యార్చనలు మరియు మార్కండేయ స్వామి విగ్రమునకు రుద్రాభిషేకం పుష్పార్చన ఆరాధనలు ఆలయ అర్చకులు బుక్కమఠం సంతోష్ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ధ్యావన పెల్లి రాజారాం భీమనాధి సత్యనారాయణ ,సంకు ఆనందు ,అన్నం నాగరాజు, గుంటుక గౌతమ్, భాస్కర్, మురళి, వాసాల నరేష్ తదితర పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## ఉత్తమ అర్చక రత్న నేషనల్ అవార్డు గ్రహీత కర్నె సాంబయ్య

**తెలంగాణ వీణ/భూపాలపల్లి:** జయశంకర్ భూపాల పల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన కర్నె సాంబయ్య కు తిరుపతిలోని గండమ నేని శివయ్య మెమోరియల్ ట్రస్ట్ భవన్లో ఆదివారం జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఉత్తమ అర్చక రత్న నేషనల్ అవార్డు అందుకు న్నారు.వారు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర డి డి ఎన్ అర్చక సంఘం, క్రమశిక్షణ సంఘం కార్యదర్శి, శ్రీ పార్వతి సమేత పరమ శివాలయం అర్చకులు గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారు మాట్లాడుతూ అవార్డు రావడానికి సహకరించిన అందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షులు తాటికంటే ఐలన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి, బిఎస్‌పి రాష్ట్ర సెలెక్ట్ కమిటీ సభ్యులు వంగ కుమార్ స్వామికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 16న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

**తెలంగాణ వీణ/నాగర్ కర్నూల్ జిల్లా:** కల్వకుర్తి పట్టణం లోని ప్రభుత్వ అతిథి గృహంలో సోమవారం మధ్యాహ్నం ఫిబ్రవరి 16న జరుగు దేశవ్యాప్త కార్మిక సమ్మె గోడ పత్రికలను ఎఐటీయూసి జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తయిన రైతులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు నేటికీ పరిష్కరించలేదని అన్నారు. ప్రపంచంలోని 125 దేశాల్లో ఆకలితో అలమటిస్తూ భారత్ 111వ స్థానంలో ఉందని అన్నారు. ఫిబ్రవరి 16న జరుగు భారత్ బంద్ లో పెద్ద ఎత్తున కార్మికులు కర్షకులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు పులిజాల పరశురాములు, గడ్డం శ్రీనివాసులు, బీస జగన్, నేరటి రాజు, పోలె పురుషోత్తం, బాస ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ



**తెలంగాణ వీణ/కోరుట్ల:** మెట్‌పల్లి జెడ్పిహెచెస్ పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఆడెపు శివకుమార్ దంపతులు తమ 35 వ వార్షికోత్సవం సందర్భంగా నోట్ పుస్తకాలు, పెన్నులు మరియు ఇతర వస్తువుల్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన వాటిని అడక్కుండానే అందించిన శివకుమార్ దంపతుల్ని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## మల్లాపూర్ నూతన ఎస్ఐగా కిరణ్ కుమార్ భాద్యతలు స్వీకరణ



**తెలంగాణ వీణ/కోరుట్ల:** కథలాపూర్ పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ గా పనిచేసిన కిరణ్ కుమార్ బదిలీపై మల్లాపూర్ పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్సై గా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు ఇక్కడ ఎస్ ఐ గా పనిచేసిన నవీన్ కుమార్ కథలాపూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మల్లాపూర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అసాంఘిక కార్యక్రమాలు అక్రమ మద్యంపై దృష్టి సారిస్తామని అన్నారు అనంతరం పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపారు.

## ముమ్మరంగా గృహ జ్యోతి కార్యక్రమం



**తెలంగాణ వీణ/కోరుట్ల:** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహ జ్యోతి కార్యక్రమం డివిజన్ పరిధిలో ముమ్మరంగా సాగుతుంది. సోమవారం పట్టణంలో విద్యుత్ అధికారులు గృహ జ్యోతి కార్యక్రమంలో బాగంగా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబర్ లను సేకరించి దరఖాస్తులను పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏఈ లు రవి కుమార్, మమత పరిశీలించారు. సిబ్బంది అనంతం, లక్ష్మణ్, బానుచందర్, రంజిత్‌లు ఉన్నారు.

## డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్స్‌కు డీఎస్సీలో అవకాశం కల్పించాలి

**- జిల్లా కలెక్టర్, డిఈఓకు వినతి**

**తెలంగాణ వీణ/కోరుట్ల:** తెలంగాణ రాష్ట్రం లో నిర్వహించే మెగా డీఎస్సీలో ఖాళీ గా ఉన్నా డ్రాయింగ్,క్రాఫ్ట్,మ్యూజిక్ టీచర్లకు అవకాశం ఇవ్వాలని జగిత్యాల జిల్లా ప్రజావాణి లో అడిషనల్ కలెక్టర్ మధుకర్ కు మెట్ పల్లి కి చెందిన కొందరు యువకులు వినతి పత్రం అందించారు .మాకు ప్రభుత్వం నుండిగాని ప్రైవేట్ రంగాలలో ఎటువంటి ఉపాధి లేక కళ ను నలుగురికి నేర్పే అవకాశం లేక మా జీవితాలు రోడ్డున పడ్డాయి. కాబట్టి ప్రభుత్వం నిర్వహించే మెగా డీఎస్సీ లో డ్రాయింగ్ , క్రాఫ్ట్,మ్యూజిక్ విద్యార్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు.అలాగే కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహిస్తున్న సర్వ శిక్ష అభియాన్ స్కూళ్ళ లో గల డ్రాయింగ్,క్రాఫ్ట్,మ్యూజిక్ కాంటాక్ట్ పద్ధతిలో గలా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే నియమించుకోవడానికి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో మ్యాడారపు మారుతిచారి,గజం రవికాంత్,కె.నరేందర్,సురేష్ పాల్గొన్నారు.

# జీవో 317 బాధితులను సొంత జిల్లాలకు పంపాలి

**- కొత్త నియామకాల ముందే మాకు న్యాయం చేయాలి**

**- బాధ్యత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే జీవో 317 బాధితులను తమ సొంత జిల్లాకు పంపించాలని బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ఒలంపిక్ భవన్ లో తెలంగాణ గురుకుల మైనార్టీ అధ్యాపకులు బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ని కలిసి మద్దతు తెలిపి జేఏసీలో కలిచారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు విజయకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 48 గంటల్లో 317 బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీ ఇచ్చిన విధంగా బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులను సొంత జిల్లాలు, జోన్లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలానే మైనార్టీ



గురుకులాలలో జరిగే కొత్త నియామకాల కంటే ముందే తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా జీవో 317 వల్ల ఇబ్బంది పడుతున్నామని గత ప్రభుత్వం మమ్మల్ని పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ ప్రభుత్వం మా సమస్యను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో యాదయ్య, వేణుగోపాల్, కవిత, మెహ్రీన్,మీనులు పాల్గొన్నారు.

# 16న కార్మిక, కర్షకుల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**- సిఐటియు రాష్ట్ర ప్రధాన పాలడుగు భాస్కర్**

**తెలంగాణ వీణ/గార్ల:** 16వ, తేదీన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సిఐటియు అధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నూతన విప్లవాన్ని తీసుకు వచ్చేందుకు డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం ఆహార ధాన్యాల పంటతో పాటు వ్యాపార పంటలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులలో కొలతలు లేకుండా కేరళ రాష్ట్ర తరహాలో కనీస కూలీ ?600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మీకులకు కనీస వేతనం చెల్లించాలని,ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కుల సమస్యల పరిష్కారం కోసం సంఘాలు పెట్టే విధానాన్ని బిజెపి రద్దు చేయడం దారుణం మనీ మండి పడ్డారు. జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టం చేసి తక్షణమే అమలు చేయాలన్నారు.పదేండ్ల బిజెపి పాలనలో నిరుద్యోగం,ఆకలి, దారిద్ర్యం పెరిగిందని, పెట్టుబడి దారుల సంపద పెరిగిందని, కార్మికుల సంపద తగ్గిందని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నియంత్రణ చట్టం ఉండగా బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసిందని, ప్రభుత్వ రంగం వాటాలను అమ్మడం కాంట్రాక్టు,ఓట్ సోర్సింగ్ ఉద్యోగాలు అమలు చేస్తున్నారని అన్నారు. బలవంతంగా దేశ ప్రజలపై మతత్వాన్ని రుద్దుతున్నారని మండి పడ్డారు.దేశ వ్యాప్త సమ్మెకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపడం జరిగిందని, అఖిల భారత రైతు సంఘాలు,కార్మిక సంఘాల పిలుపు మేరకు జరగనున్న సమ్మె,గ్రామీణ బంద్‌లో కార్మికులు, కర్షకులు,సాధారణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు



బండ్ల అప్పిరెడ్డి,భూక్య హరి,మౌలానా,జడ శ్రీను, లల్లు,నాగరాజు, మల్లయ్య, ప్రవీణ్, సర్వర్,వీరాస్వామి, ఇస్తారి,బిక్షం,కార్మికులు తదితరులున్నారు.

## మెగా అవార్డ్స్ స్ఫూర్తి శిఖర అవార్డు గ్రహీత "స్వరసుధ" మ్యూజిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.వి. రెడ్డి

**- విజయలక్ష్మి దంపతులకు ఘన సన్మానం - స్వర సౌరభ బిరుదును ప్రధానం**



**తెలంగాణ వీణ/ఖమ్మం:** ఖమ్మం నగరంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో మెగా అవార్డ్స్ స్ఫూర్తి శిఖర అవార్డు గ్రహీత "స్వరసుధ" మ్యూజిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.వి. రెడ్డి – విజయలక్ష్మి దంపతులను స్వర సుధ" గౌరవ అధ్యక్షులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారుపల్లి సురేష్ , అధ్యక్షులు శ్రీ కొమర్రాజు మాధవరావు , ముఖ్య సలహాదారులు , "స్వర సుధ సుజనహిత", ప్రముఖ లాయర్ శ్రీమతి డా" వనం కృష్ణవేణి , స్వర సుధ ట్రెజరర్ పి.జే వినయ్ కుమార్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ ఊటుకూరు శ్రీనివాసరావు , పోతుగంటి వెంకటేశ్వర్లు , సత్యసాయి సేవా ట్రస్ట్ శ్రీ నంద్యాల రవి , మొగిలి ఎంటర్టైన్మెంట్స్ శ్రీ మొగిలి గుణకర్ , "స్వర మధు రిమ" అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ , సెక్రెటరీ శ్రీమతి మాలతీ నాయుడు పాల్గొని ఘనంగా శాలవలతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు . స్వర సౌరభ" బిరుదును ప్రధానం చేశారు. ఇలాంటి బిరుదులు , అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సంగీత విభావరి కార్యక్రమంలో వీవీ రెడ్డి, మాధవరావు, ఊటుకూరు శ్రీనివాసరావు , శ్రీమతి భారతి (గుంటూ రు),రేవతి హైదరాబాద్, ప్రియాంక లు ఆలపించిన గీతాలు శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి.

## బీర్కూర్ ఎస్సైగా రాజశేఖర్

**తెలంగాణ వీణ/కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రానికి ఎస్ఐగా రాజశేఖర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. నిజాంసాగర్ నుంచి బదిలీ పై బీర్కూర్ కు వచ్చారు. ఇప్పటిదాకా ఎస్సైగా పని చేసిన నర్సింలు కామారెడ్డికి బదిలీ పై వెళ్లారు. మండలంలో శాంతీ భద్రతలు పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతీ భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పట్టు పరిశ్రమ రంగంలో రైతులు గణనీయమైన ప్రగతిని సాధించాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**




**తెలంగాణ వీణ/అనకొండ జిల్లా స్టాపర్:** పట్టు పరిశ్రమలో గణనీయమైన ప్రగతిని సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, కేంద్రీయ పట్టు మండలి, ములుగు, సిద్దిపేట జిల్లాలు, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో పట్టు రైతులు, రీలర్లు, వీవర్ల సమ్మేళనం 'పట్టు కృషి మేళా' ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను కలెక్టర్ సందర్శించగా వాటిని గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పట్టు పరిశ్రమలో గణనీయమైన ప్రగతిని సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. పట్టు పరిశ్రమ రంగంలో సాంకేతికతను వినియోగించుకుంటూ రైతులు అభివృద్ధి చెందాలన్నారు. పట్టు పరిశ్రమలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. పట్టు పరిశ్రమ రంగానికి సహకారం అందిస్తామన్నారు. సమావేశానికి రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ శాఖ జెడి లత మాట్లాడుతూ పట్టు పరిశ్రమల రంగంలో రైతులు లాభాలను గడిస్తున్నారని అన్నారు. నూతన సాంకేతిక పద్ధతులను తెలుసుకొని పట్టు రైతులు గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పట్టు పరిశ్రమకు దేశంలోనే మంచి పేరు ఉందని అన్నారు. తెలంగాణలోని పది జిల్లాల్లో పట్టు పరిశ్రమ రంగం బాగుందని, మిగతా జిల్లాల్లో విస్తరించాల్సి ఉందన్నారు. మార్కెటింగ్ లో పట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ రంగంలో మంచి ప్రగతిని సాధించడానికి చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పలు సలహాలు సూచనలు చేశారు. మైసూర్‌లోని సిఎస్ఆర్టిఐ డైరెక్టర్ డాక్టర్ గాంధీదాస్, వరంగల్ జెడిఎస్ అనసూయ, డాక్టర్ వినోద్ కుమార్ యాదవ్, అధికారులు, పట్టు రైతులు, రీలర్లు, వీవర్లు పాల్గొన్నారు.

# చిల్కానగర్ డివిజన్లోని కుమారి కుంటలో విస్తృతంగా పర్యటించిన కార్పొరేటర్ బన్నాల





**తెలంగాణ వీణ/ఉప్పల్:** పోలీసు అధికారుల సహకారంతో గంజాయి సేవించి ప్రజలను ఇబ్బంది పెట్టే వాళ్లపై కఠిన చర్యలు చేపడతాం కార్పొరేటర్ బన్నాల, చిల్కానగర్ డివిజన్లోని కుమారీకుంట కాలనీ లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కాలనీ అసోసి యేషన్ సభ్యులతో కలిసి విస్తృతంగ పర్యటించడం జరిగింది. కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ గీత ప్రవీణ్ కి పర్యటనలో భాగంగా వర్షం నీళ్లు పోవడానికి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ ఏర్పాటు చేయాల్సిందిగా, కాలనీ లో కరెంటు లో వాల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న ట్రాన్స్ఫార్మర్ ని ఎంహాన్స్ చేయాల్సిందిగా, అదేవిధంగ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ వేయాల్సిందిగా, కాలనీలో కొన్ని పొల్లకి వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సిందిగా, అదేవిధంగా కొన్ని బాగా వంగిపోయిన ఎలక్ట్రికల్ పోల్స్ ని నూతన పోల్స్ తో మార్చాల్సిందిగా, కాలనీలో పలుచోట్ల ఆకతాయి కుర్రాళ్ళు గంజాయి సేవిస్తున్నారని పోలీస్ పెట్రోలింగ్ వెహికల్ తిరిగే విధంగా చేయాల్సిందిగా కోరడం జరిగింది, పైన గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరలో పనులు పూర్తి అయ్యేవిధంగా చూస్తానని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కాలనీ వాసులకు హామీ ఇవ్వడం జరిగింది, కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, మహమూద్, కుమ్మరి కుంట అధ్యక్షులు సదానంద్ చారి,పోకల రవి, కృష్ణా, నర్సింలు,సోమేశ్, సుధాకర్ ముదిరాజ్ , భూపతి, రామ్ రెడ్డి , శివకోటి సతీష్ కుమ్మరి కుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మొదలగువారు పాల్గొన్నారు.

# ఏనుమాముల పోలీస్ స్టేషన్లో ఎస్హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన సిఐ పుల్యాలా కిషన్




**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో ఉన్నా పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ హెచ్ ఓ గా పుల్యాలా కిషన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న సిఐ ఏ మహేందర్ ను వరంగల్ విఆర్ కు పంపడంతో ఆ స్థానంలో పుల్యాలా కిషన్ ను నియమించారు, కాగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట రూరల్ దుగ్గొండి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న పి కిషన్ ను ఏనుమాముల పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు ఏనుమాముల సిఐ గా బాధ్యతలు చేపట్టిన కిషన్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలానికి చేరుకోని బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు అసంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు మక్కా గుట్కా పేకాట ఇసుక అక్రమ రవాణాలు సంబంధించిన ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదన్నారు బాధ్యతలు స్వీకరించిన కిషన్ కు ఎస్సైలు పోగుల శ్రీకాంత్ హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ హోంగార్డులు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

# ఓయూలో మెగా రక్తదాన శిబిరం ప్రారంభించిన డాక్టర్ లోకేష్ యాదవ్



**తెలంగాణ వీణ/ఓయూ:** టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ మెంబర్, స్ట్రాటజీ కమిటీ మెంబర్ డాక్టర్ లోకేష్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈరోజు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఉస్మానియా విద్యార్థులు, నిరుద్యోగులు, యువకుల ఆధ్వర్యంలో తల సేమియాతో, రక్తహీనతతో బాధపడే వారికోసం భారీ రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి డాక్టర్స్, టీం వారితో రక్త సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున విద్యార్థులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ఎంతోమంది విద్యార్థులు రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వికాస్, శ్రీనివాస్ యాదవ్, రామచంద్ర యాదవ్, లెనిన్, శ్రావణ్, వినోద్, మనోహర్, శంకర్ యాదవ్, అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# గాంధీనగర్ ఇండస్ట్రియల్ 'స్టార్ ఎంటర్ ప్రైజెస్' కార్మికులకు న్యాయం

**- బిఆర్టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్...**




**తెలంగాణ వీణ/కుత్బుల్లాపూర్:** తెలంగాణ వీణ నియోజకవర్గంలోని గాంధీనగర్ ఇండస్ట్రియల్ "స్టార్ ఎంటర్ ప్రైజెస్" కంపెనీలో ఇద్దరు కార్మికులు ఒకరు రహీం భాష, మరొకరు ఎస్ కే పాషా, అనే కార్మికులు గత కొన్ని సంవత్సరల నుంచి కంపెనీలో పని చేసేవారు కొన్ని అన్నివార్య కారణాలవల్ల కంపెనీ యజమాన్యం పనిలో నుంచి ఇద్దరు కార్మికులను తీసేవేయడం జరిగింది... కార్మికులకు గత ఐదు నెలల క్రితం సెప్టెంబర్ నెల రావలసిన వేత్తనం ఒక నెల ఒక్కొక్కరికి 25000/–చొప్పున మొత్తం ఇద్దరికీ 50 వేల రూపాయలు రావాల్సి ఉండగా పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగిన యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు తమకు తెలిసిన కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తమాకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే కార్మిక నాయకుడు రవి సింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యొక్క యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికులకి రావాల్సిన ఇద్దరికీ కలిపి మొత్తం 50 వేల రూపాయలు, ఇప్పించారు... వెంటనే కార్మికులు రహీం భాష, ఎస్ కే పాషా, రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి.మనోజ్ కుమార్.అనిల్ కుమార్.సుదర్శన్.జగన్ తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీది జనం మెచ్చిన పాలన

**- మరోసారి మోడీ రావాలని కోరుకుంటున్న ప్రజలు - కరకగూడెం ఏజెన్సీ ఏరియాలో బిజెపి గావ్ ఛలో అభియాన్లో బిజెపి జిల్లా అధ్యక్షులు కేవీ రంగా కిరణ్**









**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** మరోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం రావాలని క్షేత్రస్థాయిలో ప్రజలు కోరుకుంటున్నారని బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కేవీ రంగా కిరణ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు "గావ్ ఛలో అభియాన్"(పల్లెనిద్ర) కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ ఏరియా పినపాక నియోజకవర్గ కరకగూడెం మండలం అనంతరం గ్రామంలో మండల అధ్యక్షులు గంగినపిల్లి నాగేశ్వరరావు స్వగృహంలో భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కేవీ రంగా కిరణ్ బస చేయడం జరిగింది. ఈ సందర్భంగా 32వ పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో సమావేశము నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి భోజనం చేసిన కె.వి.రంగా కిరణ్ మార్నింగ్ వాక్ లో రైతులను, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన స్మశాన వాటిక డంపింగ్ యార్డ్ లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక గ్రామ పెద్దలను కలుసుకున్నారు.డ్వాక్రా మహిళలు ప్రధానమంత్రి ఉజ్వల యోజన ముద్ర యోజన వంటి కేంద్రప్రభుత్వ పథకాల అబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం పట్ల అవగాహన కల్పించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ విజయాలను వారికి తెలియజేశారు. అనంతరం కూనవరం గ్రామంలోని పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్యను శాలువతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారని మరోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని క్షేత్రస్థాయిలో పర్యటన సందర్భంగా అన్ని వర్గాల ప్రజల నుండి విశేష స్పందన కనిపించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య అసెంబ్లీ కన్వీనర్ పున్నం బిక్షపతి జిల్లా అధికార ప్రతినిధి శ్రీరామ చంద్రయ్య బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కొమ్ము వంశీ దంతులూరి రామచంద్రరాజు పినపాక మండల అధ్యక్షులు దూలిపూడి శివ ప్రసాద్ గోగు అనిల్ పాయం లక్ష్మీనారాయణ రాజు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు సంరక్షణ చట్టం క్యాలెండర్ ఆవిష్కరణ



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో:** సమాచార హక్కు సంరక్షణ చట్టం 2005 క్యాలెండర్లను సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు సంరక్షణ చట్టం బృందం డిఆర్ఓ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులందరికీ క్యాలెండర్లు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సమాచార హక్కు సంరక్షణ చట్టం రాష్ట్ర సహాయక కార్యదర్శి మొహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ సమాచార చట్టంలో పారదర్శకత అవినీతి రహిత జవాబుదారితనంగా ఉండాలని ప్రభుత్వ అధికారులు సమాచార చట్టాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్క పౌరుడు సమాచారం అడిగే హక్కు ఉందని అన్నారు. సమాచార దరఖాస్తు పెట్టిన 30 రోజుల్లో ఇవ్వాలని రియాజ్ పేర్కొన్నారు.

# పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత

**- పర్యావరణం పచ్చదనం లేని సమాజాన్ని ఊహించలేం**
**- అబ్దుల్ కలాం పార్క్లో ఎండిపోయిన చెట్లకు నీళ్లు పోసిన ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి**



**తెలంగాణ వీణ/ఉప్పల్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఔషపూర్ గ్రామంలో అబ్దుల్ కలాం పార్క్ లో పచ్చని చెట్లు,మొక్కలు పార్కులో ఎండిపోయిన విషయం తెలుసుకున్న మేడ్చల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి అక్కడికి వెళ్లి చెట్లకు నీళ్లు పోశారు.వారు మాట్లాడుతూ పర్యావరణం పచ్చదనం లేని సమాజాన్ని ఊహించలేమని గ్రామాల్లో పచ్చదనం పెంచడం,పరిశుభ్రత పాటించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. పార్కులోని మొక్కలకు సమయానికి నీరు పోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు మల్లేష్, నాయకులు జిల్లాల రాజశేఖర్ రెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# 2024, మేడిపల్లి మండలం, సిపిఐ పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం



**తెలంగాణ వీణ/ఉప్పల్:** మేడిపల్లి మండలం, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024, సిపిఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సభ్యత నమోదు కార్యక్రమమును మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఈ సభ్యత కార్యక్రమమును నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమును ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ ఈ సభ్యతమును కార్మికులు, కర్షకులు వివిధ రంగాలలో ప్రవేట్ సెక్టార్ లో పనిచేస్తున్న ఉద్యోగులు సిపిఐ పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీ సభ్యత్వం తీసుకోవడం జరిగినది. సిపిఐ పార్టీ పేదల పక్షాన నిలబడి, పేదల కోసం పనిచేస్తుందని సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలపైనిలదీస్తుందని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేడిపల్లి మండలం ఏఐటీయూసీ కార్యదర్శి దండు రమేష్, ఇంద్రానగర్ శాఖ కార్యదర్శి మాచర్ల కనకయ్య, సిపిఐ పార్టీ సభ్యులు వెంకటమ్మ, లక్ష్మీ, మణెమ్మ, సుజాత, రమేష్, ఎన్. ఆంజనేయులు, ఎన్. రజిత, యాకూబ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే బండారి రాజారెడ్డి జన్మదిన వేడుకలు

**తెలంగాణ వీణ/ఉప్పల్:** సోమవారం ఉప్పల్ నియోజకవర్గం ఏర్పడిన తరువాత కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రథమ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా హబ్సిగూడ లోని వారి నివాసానికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి మాజీ కార్పోరేటర్ కొత్త రామారావు, డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు అన్య బాలకృష్ణ నవీన్ మైనారిటీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## 25 వరకు పుష్ పుల్ రైలు రద్దు..

**తెలంగాణ వీణ/కాజీపేట:** విజయవాడ కాజీపేట మధ్య నడిచే పుష్ పుల్ రైలును సోమవారం12తేదీ నుంచి ఈ నెల 25 లేదీవరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వరంగల్ విజయవాడ మధ్య మూడో లైన్ నిర్మాణపనుల కారణ ంగా రద్దు చేస్తున్నామన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని రైల్వే అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్లో పలువురు బిఆర్‌యస్ కార్యకర్తల చేరిక



**తెలంగాణ వీణ/నెక్కొండ:** నెక్కొండ మండలకేంద్రంలోని సాయిరెడ్డి పల్లి గ్రామంలోని పలు బి ఆర్ యస్ కార్యకర్తలైన నక్కిరెడ్డి కుమారస్వామి, కూస విజేందర్, బానోతు విజయ్ లు యమ్ పి టి సి వినయకుమారి శ్రీనివాస్ల ఆధ్వర్యంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సగౌరవంగ పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బానోత్ బిచ్చ, ఉపాధ్యక్షులు పెండ్లి రవి, యూత్ అధ్యక్షులు పొనుగోటి సురేష్, వెంకన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**తెలంగాణ వీణ/నడికూడ:** నడికూడ మండల కేంద్రానికి చెందిన కామిడ్రి దేవేందర్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నడికూడ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మలహాల్ రావు ఆధ్వర్యంలో మృతుడికి నివాళులర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సదానందం, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల సురేష్, ప్రభాకర్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ బండికి సైలెన్సర్ బ్యాన్



**తెలంగాణ వీణ/హన్మకొండ క్రైమ్:** హన్మకొండ లో కేయూ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీస్‌లు వాహనాలు తానికి నిర్వహిం చారు. ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు మాట్లాడుతూ వాహనాల పత్రాలు సారిగా లేకుంటే కఠిన చెర్యలు తప్పవు అని చెప్పారు అదే క్రమం లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.బుల్లెట్ ద్విచక్రా వాహనాలకు సైలెన్సర్ లు మడిఫై చేస్తే వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. అవరైనా ట్రాఫిక్ నిబంధనలు అతిక్రామిస్తే వాహనాలు సీజ్ చేస్తాం అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ సీఐ సీతరెడ్డి, ఎస్ఐ లు యుగేందర్, మనోజ్ రెడ్డి తదితర పోలీస్ లు పాల్గొన్నారు.

## సోమన్న ఆలయంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్ పూజలు

**తెలంగాణ వీణ/పాలకుర్తి:** శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజ్ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ రోహిత్ రాజ్‌కు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సన్మాని ంచి, స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్ర మంలో సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్,బండి శ్రవణ్ కుమార్,అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# 16న గ్రామీణ బంద్ విజయవంతం చేయండి: వి.ఎస్ బోస్






**తెలంగాణ వీణ/కాప్రా:** దేశం కోసం శ్రమిస్తున్న కార్మిక, రైతుల జీవితాలు జీవనోపాధిపై నిరంతరాయంగా అనాగరిక దాడులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తుందని ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ఎస్. బోస్ ఆరోపించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలనీ కోరుతూ నాచారం చౌరస్తా వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ కార్పొరేట్– మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ఎస్. బోస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిపాలనా అధికారాలను పూర్తిగా దుర్వినియోగం చేస్తూ, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తుందని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం కోసం పోరాడి తెచ్చుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నిరంకుశంగా రద్దు చేసి, కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా విభజించి కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చివేసింది ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ నల్ల కోడ్లతో దేశంలోని కార్మికులంతా హక్కులు, సామాజిక భద్రతను కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అయన ఆవేదన వ్యక్తం చేసారు. ప్రధాని మోడీ రైతులకు ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేసాడని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ కళ్ళు తెరిపించేందుకు కార్మికులు, రైతులు కలసి ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నామని, సామాన్య ప్రజలు, విద్యార్థి, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక/గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని కోరారు.అదే విధముగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లా డుతూ సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా రానున్న ఎన్నికల్లో కూడా మోడీని సాగనంపాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ మేడ్చల్ జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎస్. శంకర్ రావు, బుచ్చి రెడ్డి,నేతలు నర్సింహా, కృపాకర్, మిరియాల సాయిలు, నర్సింగ్ రావు.... ఐ ఎన్ టీ యూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, టీఎన్ టీ యూసీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, నేతలు గణేష్, కృష్ణ రెడ్డి,చంద్ర శేఖర్, సౌందర్ రాజు, అబ్దుల్లా, సత్యం పాల్గొన్నారు.

# ఈ జ్యూసులతోనే ఇమ్యూనిటీ పవర్

**- సర్వరోగ నివారిణి గుమ్మడికాయ జ్యూస్**

**- వైద్యురాలు కొచ్చర్ల కమల రాణి**





**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో:** ఇప్పుడున్న పరిస్థితులలో ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటించాలని.. అంతేకాకుండా ఆహారపు అలవాట్లు మార్చుకొని శక్తివంతమైన ఆరోగ్యంగా ఉండేందుకు చూసుకోవాలని బిఎస్ఐ కొత్తగూడెం జిల్లా ప్రెసిడెంట్, వైద్యురాలు కొచ్చర్ల కమల రాణి అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని రైటర్ బస్తి ఏరియాలో ఉన్న ప్రకృతి ఆశ్రమ (ఆరోగ్య నిలయం)లో ప్రతి మనిషిలో ఇమ్యూనిటీ పవర్ పెంచుకునేందుకు అందుకు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు గురించి, పలు రకాల జ్యూసులు తీసుకుంటే పెరిగే ఇమ్యూనిటీ పవర్ కలిగే లాభాలపై కమల రాణి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యానికి గుమ్మడికాయ జ్యూస్ ఎంతో మంచిదని అన్నారు. అంతేకాకుండా గోధుమ గడ్డి జ్యూస్ సైతం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆరోగ్యానికి శక్తినిచ్చే రాగి జావా క్యారెట్ జ్యూస్ బీట్రూట్ కీర దోస కొత్తిమీర పుదీనా తులసి జ్యూసులు తీసుకుంటే ఆరోగ్యానికి తిరుగులేదని పేర్కొన్నారు. ఈ జ్యూస్‌లు ఆరోగ్య నిలయంలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకై 8919569524 సంప్రదించాలని కొచ్చర్ల కమల రాణి తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని తన తపనని అందుకు తన శక్తి మేరకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు పోవడం జరుగుతుందని కమల రాణి స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి చిన్న చూపు...

**- ఏబీవీపి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు..**



**తెలంగాణ వీణ/ఓయూ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2,75,891 కోట్ల రూపాయల్లో విద్యారంగానికి కేవలం 21,383 కోట్లు కేటాయించడాన్ని ఏ బీ వీ పి స్టేట్ వర్కింగ్ కమిటి మెంబర్ అలివేలి రాజు తప్పు పట్టారు.. ఆయన మాట్లాడుతూ దాదాపు ఈ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి 30% నిధులు అవసరం ఉన్న చోట ఈ రాష్ట్ర ప్రభుత్వం 7.5% నిధులు కేటాయించడం పై మండిపడ్డారు. విద్యార్థులు అందరూ కొండంత ఆశతో నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ఆ ప్రభుత్వం కూడా విద్యారంగం అభివృద్ధికి కృషి చేయకపోవడం బాధాకరం.విద్యార్థులకు మూడు ఏళ్ళ నుండి రావలసిన ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్ షిప్ ఇప్పటి వరకు కూడా విడుదల చేయక పోవడం నిజంగా ఈ ప్రభుత్వానికి విద్యార్థుల మీద ఉన్న శ్రద్ధ అర్ధమయ్యితుంది . వెంటనే ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తగిన నిధులు మంజూరు చేసి ,విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. లేని యెడల ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు..



## పోలవరం కేంద్రంగా గిరిజన జిల్లా ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్



**తెలంగాణ వీణ/పోలవరం:** పోలవరం ప్రాజెక్టులో ముంపుకు గురైన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గిరిజన గిరిజననేతర నిర్వాసితుల్ని ఒకే జిల్లా కింద తీసుకువచ్చి అభివృద్ధి పర్చవలసిన అవసరముందని అఖిలపక్ష ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు.ఎప్పటి నుండో డిమాండ్‌గా వున్న పోలవరం గిరిజన జిల్లాను పోలవరం జిల్లా కేంద్రంగా తక్షణం ఏర్పాటు చేయాలని కోరుతూ పోలవరంలోని పాతపోలవరం గ్రామ దేవత కడెమ్మ గుడి పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులతో అఖిలపక్ష ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహిం చారు. జే.ఏ.సీ. నాయకులు నాళం గాంధీ,బుగ్గా. మురళీకృష్ణ, సొబ్బన. మోహన్,దమంగిన.వెంకటరమణ(కొండ)లు మాట్లాడుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని అధికార,ప్రతి పక్ష అధినాయకులు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అందువల్ల జిల్లా చేయటానికి తక్షణం చర్యలు చేపట్టాలన్నారు.జిల్లా ఏర్పాటు చేసే వరకు జె.ఎ.సి.ఆధ్యర్యంలో పోరాటం జరుతుందని తెలిపారు. మొదటిగా పోలవరం గ్రామంలో ,మండలంలోని అన్ని గ్రామాలలో ప్రచారం చేయనున్నట్లు తెలియజేశారు.ఈ ఉద్యమం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని అన్ని ఏజెన్సీ మండలాల్లో, గిరిజన నియోజకవర్గాల్లో నాయకులు, ప్రజలతో కలిపి విస్తృత పరిచి ఉధృతం చేయనునట్లు చెప్పారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరించి వినతి పత్రాలను ఇస్తామ న్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసిత గ్రామాలు ఖాళీ చేసి పునరావాస గ్రామాలకు తరలి పోవడంతో వ్యాపారాలు లేక వ్యాపారస్తులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలియజేశారు. వేలాది ఎకరాల వ్యవసాయ భూమిని భూసేకనరణ చేయ్యడంతో భూములు కోల్పోయిన రైతులు, కూలీలుగా మారిపోయారని, వ్యవసాయ కూలీలు పనులు లేక,ఉపాధి కరువై అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామల నిర్వాసితులు అభివృద్ధి చెందాలంటే పోలవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు కావాలని జె.ఏ.సి. నాయకులు స్పష్టం చేశారు. వేలాదిమంది జనాలతో ఎటుగట్టు సెంటర్లో ఈ నెల 17 వ తేదీన పెద్ద ఎత్తున ధర్నా, సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గంగు.అనిల్ కుమార్, ముత్యాల.రాంబాబు, గునపర్తి.వీరవెంకట సత్యనారాయణ(చిన్ని), సిద్దన.వెంకటరత్నం, దొంతల పోసివర్మ, కోరసిక నాగబాబు,ముళ్ళ.అంజి బాబు, పట్నాల నారాయణరావు పాల్గొన్నారు.

# అతడు ఆడకపోవడం టెస్టు క్రికెట్‌కు అవమానకరం : బ్రాడ్



భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ మొత్తానికి దూరమవ్వడంతో మాజీ క్రికెటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంగ్లండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్ , కోహ్లీల సమరాన్ని మిస్ అవుతున్నామని కొందరు నిట్టూరుస్తున్నారు. రాజ్‌కోట్ టెస్టుకు ముందు ఇంగ్లండ్ లెజెండరీ పేసర్ స్టువార్ట్ బ్రాడ్ సైతం ఇదే అభిప్రాయం వెలిబుచ్చాడు. కోహ్లీ ఆడకపోవడం అనేది టెస్టు క్రికెట్‌కు ఎంతో అవమానకరం అని బ్రాడ్ వెల్లడించాడు.'టీమిండియా ఒక చాంపియన్ ప్లేయర్‌ను మిస్ అవుతోంది. కోహ్లీ ఆడకపోవడం టెస్టు ఫార్మాట్‌కు పెద్ద అవమానం లాంటిది. అతడొక గొప్ప ఆటగాడు. ఆట పట్ల విరాట్ అంకితభావం, మైదానంలో చిరుతను తలపించే అతడి దూకుడు అందరికీ ఇష్టమే. అయితే.. కొన్నిసార్లు వ్యక్తిగత కారణాలు ఎంతటి ప్లేయర్‌ను అయినా ఆటకు దూరం చేస్తాయి. కోహ్లీ ఆడకపోవడం అనేది యువ ఆటగాళ్లకు మంచి చాన్స్. భారత బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. కొందరు కుర్రాళ్లు ఎక్కువ కాలం జట్టుకు సేవలందిస్తారు' అని బ్రాడ్ తెలిపాడు.అంతేకాదు భారత పర్యటనలోనూ బజ్‌బాల్ విజయవంతమైందని ఈ మాజీ పేసర్ అన్నాడు. 'ఈమధ్య కాలంలో బెన్ స్టోక్స్ బృందం చేసిన అద్భుతాల్లో ఉప్పల్ టెస్టు విజయం ఒకటి. అంతకుముందు ఇంగ్లండ్ 3–0తో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఆ తర్వాత న్యూజిలాండ్‌ను మేము ఓడించాం. మొత్తంగా చూస్తే.. బజ్‌బాల్ సక్సెస్ అయినట్టే' అని బ్రాడ్ వెల్లడించాడు.

### అత్యధిక వికెట్ల వీరుడు

ప్రపంచంలోని మేటి బౌలర్లలో ఒకడైన బ్రాడ్ నిరుడు జూలైలో రిటైర్మెంట్ ప్రకటించాడు. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పు కున్నాడు. ఇంగ్లండ్ తరఫున 167 టెస్టులు ఆడిన ఈ పేసర్ 604 వికెట్లు పడగొట్టాడు. వన్డేలతో కలిపి మొత్తంగా 800 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా ఇంగ్లండ్ తరఫున రెండో అత్యధిక వికెట్ల వీరుడుగా నిలిచాడు. ఆసీస్‌పై 150 వికెట్లు తీసిన తొలి ఇంగ్లండ్ బౌలర్‌గా గుర్తింపు సాధించాడు.

# రాజ్‌కోట్ టెస్టులో భరత్‌పై వేటు.. యంగ్‌స్టర్‌కు చాన్స్..!



ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్ పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్నాడు. రిషభ్ పంత్ లోటును భర్తీ చేయలేక విమర్శల పాలవుతున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భారీ స్కోర్ చేయని భరత్.. సొంత గడ్డపై కూడా తేలిపోతున్నాడు. దాంతో, అతడిపై వేటు వేసేందుకు సిద్ధమవుతోంది. సిరీస్‌లో కీలకమైన రాజ్‌కోట్ టెస్టులో భరత్ స్థానంలో యంగ్‌స్టర్ ధ్రువ్ జురెల్‌ను ఆడిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.ఈ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ లయన్స్‌పై 116 పరుగులతో చెలరేగిన భరత్.. సీనియర్ జట్టుపై మాత్రం చతికిలపడుతున్నాడు. అదే ధ్రువ్ జురెల్ మాత్రం పరగులు వరద పారిస్తున్నాడు. నిరుడు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 15 మ్యాచుల్లో 790 రన్స్ కొట్టాడు. దాంతో, మూడో టెస్టులో జురెల్‌కు చాన్స్ ఇవ్వాలని కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లు భావిస్తున్నారని సమాచారం. ఫిబ్రవరి 15న రాజ్‌కోట్‌లో మూడో టెస్టు జరుగనుంది. చెరి రెండు టెస్టులు నెగ్గిన భారత్, ఇంగ్లండ్‌లు ఈ మ్యాచ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నాయి.రెగ్యులర్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ గాయపడడంతో భరత్‌కు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడే చాన్స్ వచ్చింది. అయితే.. ఆరు ఇన్నింగ్స్‌ల్లో 101 రన్స్ మాత్రమే చేసినా వికెట్ కీపింగ్‌తో ఆకట్టుకున్నాడు. కానీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో5, 23 పరుగులతో నిరాశపరిచాడు. ఉప్పల్ టెస్టులో 41 రన్స్ కొట్టినా.. వైజాగ్ టెస్టులో విఫలమయ్యాడు. ఇప్పటివరకూ 7 టెస్టులు ఆడిన భరత్ 12 ఇన్నింగ్స్‌ల్లో 221 రన్స్ చేశాడంతే. అది కూడా 20.09 సగటుతో.


# అతడు ఆడకపోవడం టెస్టు క్రికెట్‌కు అవమానకరం : బ్రాడ్



భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ మొత్తానికి దూరమవ్వడంతో మాజీ క్రికెటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంగ్లండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్, కోహ్లీల సమరాన్ని మిస్ అవుతున్నామని కొందరు నిట్టూరుస్తున్నారు. రాజ్‌కోట్ టెస్టుకు ముందు ఇంగ్లండ్ లెజెండరీ పేసర్ స్టువార్ట్ బ్రాడ్ సైతం ఇదే అభిప్రాయం వెలిబుచ్చాడు. కోహ్లీ ఆడకపోవడం అనేది టెస్టు క్రికెట్‌కు ఎంతో అవమానకరం అని బ్రాడ్ వెల్లడించాడు.'టీమిండియా ఒక చాంపియన్ ప్లేయర్‌ను మిస్ అవుతోంది. కోహ్లీ ఆడకపోవడం టెస్టు ఫార్మాట్‌కు పెద్ద అవమానం లాంటిది. అతడొక గొప్ప ఆటగాడు. ఆట పట్ల విరాట్ అంకితభావం, మైదానంలో చిరుతను తలపించే అతడి దూకుడు అందరికీ ఇష్టమే. అయితే.. కొన్నిసార్లు వ్యక్తిగత కారణాలు ఎంతటి ప్లేయర్‌ను అయినా ఆటకు దూరం చేస్తాయి. కోహ్లీ ఆడకపోవడం అనేది యువ ఆటగాళ్లకు మంచి చాన్స్. భారత బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. కొందరు కుర్రాళ్లు ఎక్కువ కాలం జట్టుకు సేవలందిస్తారు' అని బ్రాడ్ తెలిపాడు.అంతేకాదు భారత పర్యటనలోనూ బజ్‌బాల్ విజయవంతమైందని ఈ మాజీ పేసర్ అన్నాడు. 'ఈమధ్య కాలంలో బెన్ స్టోక్స్ బృందం చేసిన అద్భుతాల్లో ఉప్పల్ టెస్టు విజయం ఒకటి. అంతకుముందు ఇంగ్లండ్ 3–0తో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఆ తర్వాత న్యూజిలాండ్‌ను మేము ఓడించాం. మొత్తంగా చూస్తే.. బజ్‌బాల్ సక్సెస్ అయినట్టే' అని బ్రాడ్ వెల్లడించాడు.


# ధోనీ కంటే మా ఫోక్స్ చురుకైన వికెట్ కీపర్.. ఇంగ్లండ్ దిగ్గజం



ప్రపంచ క్రికెట్‌లోని గొప్ప వికెట్ కీపర్ల ప్రస్తావన వచ్చినప్పుడల్లా.. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ పేరు ముందు వరుసలో ఉండడం ఖాయం. అంతర్జాతీయ క్రికెట్‌లో మన మహీ భాయ్ వికెట్ కీపర్‌గా అంతగా తన ముద్ర వేశాడు మరి. ధోనీ లాంటి ఎంత గొప్ప వికెట్ కీపర్ లేడంటూ ప్రపంచమంతా కీర్తిస్తుంటే.. ఇంగ్లండ్ మాజీ ఆటగాడు అలెక్ స్టెవార్ట్ మాత్రం సంచలన ఆరోపణలు చేశాడు. 'వికెట్ల వెనకాల ధోనీ ఎంతో చురుకైనవాడు. అయితే.. మా బెన్ ఫోక్స్ అతడికంటే చాలా షార్ప్' అని అన్నాడు.'ధోనీ వికెట్ కీపింగ్ చూశాం. కానీ, ఫోక్స్ చాలా తెలివైన కీపర్. అతడి చేతుల వేగం సెకన్లలోపే. అతడికి సహజయంగా వచ్చిన టాలెంట్ అది. నేను సర్రే క్రికెట్ క్లబ్ డైరెక్టర్‌గా ఉన్నరోజుల్లో ఫోక్స్‌ను నిశితంగా గమనించాను. అతడు వచ్చిన చాన్స్‌ను వదులుకోడు. క్షణాల్లో బ్యాటర్లను బోల్తా కొట్టిస్తాడు. ఇక బ్యాటర్‌గానూ ఫోక్స్ అదరగొడుతున్నాడు 'అని స్టెవార్ట్ వెల్లడించాడు.భారత పర్యటనలో ఆకట్టుకుంటున్నఫోక్స్ ఇప్పటివరకూ 22 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కీపర్‌గా అద్భుతంగా రాణించిన అతడు 22 క్యాచ్‌లు పట్టడమే కాకుండా 8 స్టంపౌ ట్‌లు చేశాడు. అంతేకాదు 30.72 సగటుతో 1,014 రన్స్ కొట్టాడు. వైజాగ్ టెస్టులో అతడు వెయ్యి పరుగులు పూర్తి చేసు కున్న అతడు ఈ ఫీట్ సాధించిన 12వ ఇంగ్లండ్ వికెట్ కీపర్‌గా రికార్డు నెలకొల్పాడు.

# మైదానంలో మాటలకందని విషాదం.. పిడుగుపాటుకు బలైన ఫుట్‌బాలర్



ఆట ఏదైనా సరే అప్పుడప్పుడు మైదానంలో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతుండడం చూసుంటాం. కానీ, ఇది మాత్రం కనీవినీ ఎరుగని విషాదం. మైదానంలో పిడుగు పడి ఓ ఫుట్‌బాలర్ ప్రాణాలు కోల్పోయాడు. హృదయ విదారకమైన ఈ సంఘటన ఇండోనేషియాలో జరిగింది. స్టేడియంలో ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా ఒక ఆటగాడిపై పిడుగు పడింది.దాంతో, అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటిదాకా మైదానంలో చురకుగా కదిలిన ఆ ఫుట్‌బాలర్ క్షణాల్లోనే కన్నుమూయడం చూసి సహచరులంతా కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. ఆ ప్రమాదానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.ఆదివారం ఎఫ్‌బీఐ సబంగ్, బాండుంగ్ ఫుట్‌బాల్ క్లబ్ జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. గోల్ కొట్టేందుకు ఇరుజట్ల ఆటగాళ్లు పోటాపోటీగా తలపడుతుండగా.. మైదానంలో ఉన్న సబంగ్ ఆటగాడిపై పిడుగు పడింది. ఆ శబ్దం విని అందూరూ మైదానంలోనూ పడుకుండిపోయారు. కాసేపటికి అందరూ లేచారు. కానీ, అతడు మాత్రం అచేతనంగా పడిఉన్నాడు. వెంటనే స్టేడియంలోని సిబ్బంది అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆ ఫుట్‌బాలర్ ప్రాణాలు విడిచినట్టు డాక్టర్లు తెలిపారు.

## స్పిన్ దిగ్గజాలు సైతం అవాక్కయ్యేలా.. 'బాల్ ఆఫ్ ది సెంచరీ'..



క్రికెట్‌లో కొందరు బౌలర్లు నమ్మశక్యంకాని బంతులతో వార్తల్లో నిలుస్తుంటారు. స్పిన్ దిగ్గజం దివంగత షేన్ వార్న్ తన కెరీర్‌లో ఎన్నోసార్లు అద్భుతమైన డెలివరీలతో బ్యాటర్లను బోల్తా కొట్టించారు. 1993లో ఓల్డ్ ట్రఫోర్డ్‌లో జరిగిన టెస్టులో ఇంగ్లండ్ ఆటగాడు మైక్ గాటింగ్‌ను వార్న్ లైఫ్ టైమ్ డెలివరీతో బౌల్డ్ చేశాడు. తాజాగా ఒక లెగ్ స్పిన్నర్ అచ్చం అదే చేశాడు.కువైట్ జెర్సీ వేసుకున్న ఆ స్పిన్నర్ .. మురళీధరన్, భారత స్పిన్ దిగ్గజం హర్భజన్ సింగ్ బౌలింగ్ యాక్షన్‌ను పిస్తూ బంతిని సంధించాడు. ఫుల్ టాస్ పడిన ఆ బంతి ఆమాంత టర్న్ అయి వికెట్లను గిరాటేసింది.

## మళ్లీ పసుపు జెర్సీతో రైనా.. ఈసారి వెటరన్ లీగ్‌లో...

భారత మాజీ ఆల్‌రౌండర్ సురేశ్ రైనా మళ్లీ పసుపు రంగు జెర్సీలో కనిపించబోతున్నాడు. మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌తో కలిసి టీమిండియాకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన రైనా.. అనంతరం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రధాన ఆటగాడిగా చితక్కొట్టాడు.కొన్నాళ్లుగా ఆటకు దూరమైన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఇండియన్ వెటరన్ ప్రీమియర్ లీగ్ ఆరంభ సీజన్‌లో అభిమానులను అలరించనున్నాడు. ఈ డాషింగ్ బ్యారట్ సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ సారథిగా బరిలోకి దిగనున్నాడు. ఈ విషయాన్ని రైనా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు.



## సీఎస్కే బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ బ్యూటీ..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ 17వ సీజన్ ప్రారంభానికి ముందే వార్తల్లో నిలుస్తోంది. ఈ మధ్యే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎతిహద్ ఎయిర్‌వేస్ కంపెనీకి స్పాన్సర్‌షిప్ హక్కులు కట్టబెట్టిన సీఎస్కే.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్‌ను ఎంపిక చేసింది. అయితే.. ఈ విషయాన్ని చెన్నై మేనేజ్‌మెంట్ అధికారింగా వెల్లడించలేదు. సీఎస్కే కొత్త స్పాన్సర్ ఎతిహద్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న కత్రినా.. ధోనీ సేనకు ప్రచారకర్తగా వ్యవహరించనుంది. ధూమ్, టైగర్ జిందా, బాంగ్ బాంగ్, సింగ్ ఈజ్ కింగ్ వంటి సినిమాలతో పాపులర్ అయిన కత్రినా.. బాలీవుడ్ హీరో, 'ఉరి' ఫేమ్‌విక్కీకౌశల్‌ను2021లో పెండ్లి చేసుకున్న విషయం తెలిసిందే.







## పాతికేళ్ల తరువాత సరేనన్న బ్రహ్మానందం!



కామెడీ కింగ్ బ్రహ్మానందం ఉన్నాడంటే ఆ సినిమా హిట్టే! ఆమాటకొస్తే నిన్న మొన్నటివరకూ బ్రహ్మానందం లేకుండా తెలుగు సినిమా ఉండేది కాదు. ఆయన ఉంటే సినిమా ఈజీగా మార్కెట్ అవుతుందని నిర్మాతలకు నమ్మకం. దాదాపు 1200 సినిమాల్లో నటించి గిన్నెస్ బుక్ లోకి ఎక్కిన బ్రహ్మానందం, కొంతకాలంగా సినిమాలకు కాస్త దూరంగా ఉంటున్నారు. వచ్చిన ఆఫర్లన్నీ అంగీకరించకుండా పాత్ర బాగుంటేనే నటిస్తున్నారు. ఇటీవల కీడాకోలా మూవీలో బ్రహ్మీ కనిపించారు. రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్'లోనూ, ప్రభాస్ 'రాజాసాబ్' మూవీలోనూ ఆయన నటిస్తున్నట్లు తెలుస్తోంది.తాజాగా బ్రహ్మానందానికి సంబంధించిన వార్త ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. పాతికేళ్ల తర్వాత మళ్లీ ఆయన ఓ హిందీ మూవీలో నటిస్తున్నారట. గురు రణ్ ధావే, సాయి మంజ్రేకర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'కుచ్ ఖట్టా హెూ జాయ్' అనే మూవీలో నటించేందుకు బ్రహ్మీ ఒప్పుకున్నారని టాక్. గతంలో అమితాబ్ నటించిన సూర్యవంశం మూవీలో బ్రహ్మీ కూడా నటించారు. ఆ తర్వాత మళ్లీ ఓ బాలీవుడ్ మూవీకి ఓకే చెప్పడం ఇదే మొదటిసారి.

## దశరథుడిగా అమితాబ్ బచ్చన్?




దర్శకుడు నితేశ్ తివారీ ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రామాయణ్ మూవీ నిర్మాణం ప్రారంభం కాకముందే సంచలనాలు సృష్టిస్తోంది. 350 కోట్ల రూపాయల బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ మూవీని భారీ తారాగణంతో రూపొందిస్తున్నారు. రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్న రామాయణ్ మూవీలో రావణాసురుడి పాత్రకు కన్నడ సూపర్ స్టార్, కేజీఎఫ్ ఫేమ్ యశ్ ను ఎంపిక చేశారు. దశరథుడిగా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ నటిస్తున్నారనేది తాజా వార్త. అమితాబ్ ఓకే చెప్పారో లేదో తెలియదు గానీ బాలీవుడ్ లో మాత్రం ఈ వార్త ట్రెండ్ అవుతోంది.శూర్పణఖ పాత్రకు రకుల్ ప్రీత్ సింగ్ ను ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇందుకు రకుల్ కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. జాకీ భగ్నానీని వివాహం చేసుకుంటున్న రకుల్, ఏర్పాట్లలో బిజీగా ఉంది. వివాహం తర్వాత ఆమె షూటింగ్ లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. రామాయణ్ మూవీని 2025లో రిలీజ్ చేయాలన్నది నితేశ్ ప్లాన్.

# హిలేరియస్‌గా వెన్నెల కిషోర్ 'చారి 111' ట్రైలర్




టాలీవుడ్ స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చారి 111'. తమిళ ముద్దుగుమ్మ సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. టీజీ కీర్తికుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా మార్చి 01న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి కాన్సెప్ట్ టీజర్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. 1992లో ఇండియా – పాకిస్థాన్ కలిసి ఒక జాయింట్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇకపై రెండు దేశాల్లో ఎలాంటి అణ్వాయుధాలు గానీ బయోలాజికల్ ఆయుధాలు కానీ తయారు చేయగూడదు అనే సంభాషణతో ట్రైలర్ మొదలవుతుంది. ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. టెర్రరిజంకు చెందిన ఒక సీక్రెట్ గ్రూప్ కోవర్ట్ ఏజెన్సీ స్టార్ట్ చేయాలనీ చూస్తుంది. ఒకవేళ అది స్టార్ట్ అయితే దేశానికి ప్రమాదం. ఇక ఇది కనిపెట్టే సీక్రెట్ స్పైగా ఏజెంట్‌గా వెన్నెల కిషోర్ కనిపించనున్నారు. ఇక సీనియర్ నటుడు మురళి శర్మ ఈ సినిమాలో స్పై ఏజెన్సీ హెడ్?గా కనిపించనున్నారు. ట్రైలర్ మొత్తం ఫన్ ఎంటర్‌టైనర్‌గా సాగింది. ఈ సినిమాను బర్కత్ స్టూడియోస్ బ్యానర్‌పై అదితి సోని నిర్మిస్తుంది.

# ఎలాగోలా పుట్టేశాను.. సిగ్గు లేకుండా అడుగుతున్న చెప్పండి : జగపతి బాబు



ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా ప్రేక్షకులని ఎంతగానో అలరించిన జగపతి బాబు ఇప్పుడు రూట్ మార్చి సపోర్టింగ్ క్యారెక్టర్స్‌లో నటిస్తున్నాడు. బాలకృష్ణ నటించిన లెజెండ్ సినిమాతో విలన్‌గా మారిన ఈ స్టార్ హీరో ఆ తర్వాత ఎన్నో సినిమాలలో సపోర్టింగ్ క్యారెక్టర్స్ చేశాడు. వీలున్నప్పుడు ప్రధాన పాత్రలలో కూడా సినిమాలు చేస్తున్నాడు. ఏ తరహా పాత్రలోనయినా ఇమిడిపోతూ తనలోని నటుణ్ణి తెరపై కొత్తగా ఆవిష్కరిస్తున్నారు జగపతిబాబు. అయితే ఈ నటుడు సోషల్ మీడియాలో ఎక్కువ యాక్టివ్ ఉంటాడన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఎప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో అందరినీ పలుకరిస్తుంటాడు జగ్గూభాయ్. ఇప్పుడు తాజాగా ఓ పోస్టు పెట్టి వార్తల్లో నిలిచాడు.నేడు జగపతి బాబు పుట్టినరోజు. అయితే తన పుట్టినరోజును తానే సెలబ్రేట్ చేసుకుంటూ.. సరదాగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. "ఎలాగోలా పుట్టేశాను. సిగ్గు లేకుండా అడుగుతున్న, మీ అందరి ఆశీస్సులు నాకు కావాలి.. రెండోది ఎక్కువసేపు ఆలోచించకుండా తొందరగా డిసైడ్ చేయండి. ఈ రెండిట్లో ఏది కొట్టమంటారు" అంటూ ఒకవైపు మిల్క్ బాటిల్ ఇంకోవైపు గ్లేన్‌ఫిడిచ్ ఆల్కహాల్ బాటిల్‌తో ఫొటో దిగి పోస్ట్ చేశాడు. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# రాజమౌళి సెలక్షన్ సూపర్.. మహేశ్ హీరోయిన్ ఎంత అందంగా ఉందంటే..!



అందం, ప్రతిభ.. ఈ రెండూ రాజమౌళి సినిమాల్లో ప్రధాన పాత్ర వహిస్తూ ఉంటాయి. హీరోయిన్లను తెరపై గ్లామరస్ గా చూపించడంలో ఆయన తర్వాతే ఎవరైనా. హీరోయిన్ల సెలక్షన్ లో రాజమౌళి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఆర్ఆర్ఆర్ లో రామ్ చరణ్ పక్కన నటించేందుకు లండన్ కు చెందిన ఒలీవియా మోరిస్ ను ఎంచుకున్నారు. అందం, అభినయం కలబోసిన ఒలీవియా ఓ థియేటర్ ఆర్టిస్ట్.తాజాగా మహేశ్ బాబుతో తెరకెక్కిస్తున్న మూవీ కోసం రాజమౌళి కళ్లు ఇండోనేసియా నటి చీల్సీ ఎలిజబెత్ ఇస్లాన్ పై పడ్డాయి. ఆమె ఇండోనేసియాలో పేరున్న నటి. అమెరికాలో పుట్టి, ఇండొనేసియాలో స్థిరపడిన ఇస్లాన్ ఇప్పటికే అనేక సినిమాల్లో నటించింది. 2013లో 'మే ది డెవిల్ టేక్ యు' అనే హాలీవుడ్ మూవీ ద్వారా వెండితెరపైకి వచ్చిన ఇస్లాన్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో రాజమౌళిని ఫాలో అవుతూ ఉండటం విశేషం. 1995లో పుట్టిన ఇస్లాన్ రెండేళ్ల క్రితం రాబ్ క్లింటన్ కార్డినల్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది.

## పద్మ విభూషణ్ చిరంజీవికి అభినందనలు తెలిపిన మూసా ఆలీ ఖాన్




**హైదరాబాద్:** పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి తో యువనటుడు సామాజిక వేత్త, నిర్మాత మూసా ఆలీ ఖాన్,మిర్యాలగూడ. మెగాస్టార్ చిరంజీవి అన్నయ్యకు పద్మ విభూషణ్ పురస్కారం రావడంతోచిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం తో పాటు సేవా కార్యక్రమాలు చేస్తున్న మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు చిరంజీవిని కలిసే అవకాశాన్ని చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కల్పించడం జరిగింది. మిర్యాలగూడ నుంచి మూసా ఆలీ ఖాన్ కు ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందింది, మూసా ఆలీ ఖాన్ మిర్యాలగూడ చిరంజీవిని కలిసి అభినందనలు తెలియజేశారు. మూసా ఆలీ ఖాన్ మాట్లాడుతూ మెగాస్టార్అభిమానులు అన్నయ్యచిరంజీవి స్పూర్తితో భవిష్యత్తులో ఇంకా ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తామని, ఈకార్యక్రమానికి మిర్యాలగూడ నుంచి ఆహ్వానించి న స్వామి నాయుడు మరియు చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ కు మూసా ఆలీ ఖాన్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మిర్యాలగూడ నుంచి పద్మ విభూషణ్ చిరంజీవి ని కలిసిన శుభ సందర్బంగా పలువురు,పట్టణ ప్రముఖులు, కళాకారులు, చిరంజీవి అభిమానులు మూసా ఆలీ ఖాన్ నుఅభినందించారు.

## 'షీనా బోరా' హత్య కేసుపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ.. ఆసక్తికరంగా ట్రైలర్

2015లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన షీనా బోరా హత్య కేసుపై డాక్యుమెంటరీ తీస్తున్నట్లు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. 'ది ఇంద్రాణీ ముఖర్జియా స్టోరీ: బరీడ్ ట్రూత్' అనే పేరుతో ఈ డాక్యుమెంటరీ రానుండగా.. ఇందుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రీసెంట్‌గా విడుదల చేసింది చిత్రబృందం. ఇక ఫస్ట్ లుక్‌తోనే ఈ డాక్యుమెంటరీకి ఫుల్ పాపులారిటీ రాగా తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. 2015లో షీనాబోరా హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. కన్నతల్లే కూతుర్ని చంపేసిన వైనం అందర్నీ విస్మయానికి గురి చేసింది. ఏప్రిల్, 2012 సంవత్సరంలో 24 ఏళ్ల షీనా బోరాను తల్లి ఇంద్రాణి ముఖర్జీ, ఆమె అప్పటి డ్రైవర్ శ్యాంవర్ రాయ్, ఆమె మాజీ భర్త సంజీవ్ ఖన్నాలతో కలిసి కారులో గొంతుకోసి చంపారు. ఆ తర్వాత రాయ్‌గఢ్ జిల్లాలోని అడవిలో ఆమె మృతదేహాన్ని కాల్చివేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దేశవ్యాప్తంగా అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. ఇక ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న ఇంద్రాణి ముఖర్జీ గత ఆరున్నర సంవత్సరాలుగా జైలులో ఉండి మే 2022 లో జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ఇంద్రాణి ముఖర్జీ జీవితం ఆధారంగా ఈ డాక్యూమెంటరీ రానున్నట్లు తెలుస్తుంది.

## మరో అరుదైన రికార్డు క్రియేట్ చేసిన 'యానిమల్'




బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'యానిమల్'. అర్జున్ రెడ్డి ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ రికార్డులను తిరగ రాసింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.900 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. కాగా ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీలో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమాలోని పాటలు ఎంత బిగ్ హిట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇందులోని ప్రతిపాట ఒక చార్ట్ బస్టర్‌గా నిలిచి ంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలోని పాటలు అరుదైన రికార్డు క్రియేట్ చేశాయి. ప్రముఖ మ్యూజిక్ యాప్ స్పాటిఫైలో యానిమల్ ఆల్బమ్ 500 మిలియన్స్ కి పైగా స్ట్రీమ్ అయ్యింది.

## మెగాస్టార్ 'విశ్వంభర' కోసం ఫిలిం సిటీలో భారీ సెట్.?

పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష దాదాపు 18 ఏండ్ల తర్వాత చిరంజీవితో కలిసి ఇందులో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా శరవంగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ షూటింగ్ సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియా లో చక్కర్లు కొడుతుంది.ఈ సినిమాలోని ఓ స్పెషల్ యాక్షన్ సీక్వెన్స్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను వేస్తున్నట్లు సమాచారం. ఇక ఈ సెట్‌లో మెగాస్టార్‌తో పాటు విలన్స్‌పై భారీ యాక్షన్ సీన్స్‌ను షూట్ చేయనున్నట్లు టాక్. అయితే ఈ సీక్వెన్స్‌లో చిరంజీవి గెటప్ చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుందని యాక్షన్ విజువల్స్‌గా కూడా గూస్‌బంప్స్ తెప్పిస్తాయని తెలుస్తుంది.



రిపోర్టర్లు కావలెను
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
69 TV తెలుగు
తెలుగు లో రాయగల సమర్ధత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు
తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక
అన్ని జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.
వివరాల కొరకు సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్ లు
email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/
91 90525 22626
91 98485 99616

Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written